**విలేకరులు కావలెను**

**పెన్ సత్తా తెలుగు దినపత్రిక**

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు..

PEN SATTA Telugu Daily

సంపుటి : 3 | సంచిక : 163 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | మంగళవారం 4 నవంబర్ 2025 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool




# రాష్ట్రంలో 'హిందుజా' రూ.20 వేల కోట్ల పెట్టుబడులు

**కృష్ణా జిల్లా మల్లవల్లిలో ఎలక్ట్రిక్ బస్సులు, తేలికపాటి వాహనాల తయారీ ప్లాంట్**

**రాయలసీమలో సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి యూనిట్ల ఏర్పాటు**

**విశాఖలో 800 మెగావాట్ల సామర్థ్యంతో రెండు కొత్త యూనిట్లు**

**లండన్‌లో సీఎం చంద్రబాబు సమక్షంలో ఒప్పందం**

హిందుజా గ్రూపు రాష్ట్రంలో రూ.20 వేల కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. సీఎం చంద్రబాబు సమక్షంలో ఈ మేరకు కీలక ఒప్పందం కుదిరింది. విశాఖలోని హిందుజా పవర్‌ప్లాంట్ సామర్థ్యం మరో 1,600 మెగావాట్లకు పెంచడం, రాయలసీమలో సౌర, పవన విద్యుత్తు ఉత్పత్తి యూనిట్లు, కృష్ణా జిల్లా మల్లవల్లిలో ఎలక్ట్రిక్ బస్సులు, తేలికపాటి వాహనాల తయారీ ప్లాంట్లు, రాష్ట్రవ్యాప్తంగా ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు సహా వివిధ కీలక రంగాల్లో హిందుజా దశల వారీగా పెట్టుబడులు పెట్టనుంది. లండన్ పర్యటనలో ఉన్న చంద్రబాబు సోమవారం హిందుజా గ్రూపు భారత ఛైర్మన్ అశోక్ హిందుజా, యూరప్‌లోని ఆ గ్రూపు సంస్థల ఛైర్మన్ ప్రకాశ్ హిందుజా, హిందుజా రెన్యూవబుల్స్ ఫౌండర్ షోమ్ ఎ హిందుజాలతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలు, ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. ఏపీలో పారిశ్రామిక ప్రగతి కోసం అత్యుత్తమ వాతావరణం కల్పించేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. హిందుజా గ్రూపు సంస్థల ప్రతిపాదనలు త్వరితగతిన కార్యరూపం దాల్చేందుకు ఫాస్ట్ ట్రాక్ విండో ద్వారా ట్రాక్ చేస్తామని వివరించారు. ఈ కీలక ఒప్పందాలతో రాష్ట్ర యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని సీఎం తెలిపారు. భేటీ అనంతరం ఏపీలో తమ కార్యకలాపాల్ని విస్తరించడానికి హిందుజా గ్రూపు సంసిద్ధత వ్యక్తం చేసింది.



లండన్‌లో ఆక్టోపస్ ఎనర్జీ ఇంటర్నేషనల్ డైరెక్టర్ క్రిస్ ఫిట్జ్‌గెరాల్డ్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ

**గ్రీన్ ఎనర్జీ, ఎలక్ట్రిక్ మొబిలిటీ హబ్‌గా ఏపీ**

రాష్ట్రాన్ని గ్రీన్ ఎనర్జీ, ఎలక్ట్రిక్ మొబిలిటీ హబ్‌గా తీర్చిదిద్దడంలో హిందుజా పెట్టుబడులు కీలకంగా మారనున్నాయని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. ఎలక్ట్రిక్ మొబిలిటీ హబ్ ఏర్పాటు కోసం అమరావతి, అనంతపురం, కర్నూలు జిల్లాల్లో సంస్థ ప్రతినిధులు త్వరలో పర్యటించనున్నారు. విశాఖలో హిందుజాకు ప్రస్తుతం 1,050 మెగావాట్ల సామర్థ్యం ఉన్న థర్మల్ ప్లాంట్ ఉంది. దీనికి అదనంగా 800 మెగావాట్ల సామర్థ్యం గల రెండు కొత్త యూనిట్లను ఏర్పాటు చేస్తారు. రాష్ట్రవ్యాప్తంగా ఎలక్ట్రిక్ ఛార్జింగ్ స్టేషన్ల నెటవర్క్‌నూ నెలకొల్పనున్నారు. గ్రీన్ ట్రాన్స్‌పోర్టు ఎకో సిస్టం అభివృద్ధికి సహకరిస్తారు.



## ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన కంకర లారీ..

# 19 మంది దుర్మరణం

- ఎదురుగా వచ్చి ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన టిప్పర్
- కంకర మీదపడటంతో 19 మంది దుర్మరణం
- మరో 24 మందికి గాయాలు
- మృతుల్లో 13 మంది మహిళలు
- అతివేగం, అధ్వాన రహదారే కారణం
- చేవెళ్ల మండలం మీర్జాగూడ వద్ద దారుణ ఘటన
- తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని, ముఖ్యమంత్రి
- చనిపోయిన వారికి రూ.7లక్షలు, గాయపడిన వారికి రూ.2 లక్షల చొప్పున ఇస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం





రంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. తాండూరు డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సును కంకర లోడుతో వెళ్తున్న లారీ ఢీకొట్టింది. చేవెళ్ల మండలం మీర్జాగూడ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. బస్సుపై కంకర లోడు పడిపోవడంతో పలువురు ప్రయాణికులు దానికింద కూరుకుపోయారు. ఈ ప్రమాదంలో 19 మంది మృతి చెందగా.. 20 మంది తీవ్రంగా గాయడ్డారు. మృతుల్లో 10 మంది మహిళలు, 8 మంది పురుషులు, ఒక చిన్నారి ఉన్నారు. ప్రమాద సమయంలో ప్రయాణికుల ఆర్తనాదాలతో ఆ ప్రాంతం హృదయ విదారకంగా మారింది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మూడు జేసీబీల సాయంతో సహాయక చర్యలు చేపట్టారు. కంకరలో కూరుకుపోయిన వారిని బయటకు తీస్తున్నారు. క్షతగాత్రులను చేవెళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది. 14 మృతదేహాలకు చేవెళ్ల ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం పూర్తయినట్లు మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు. క్షతగాత్రుల్లో

వివరాలు 2లో..

# నెల్లూరు సెంట్రల్ జైలుకు జోగి రమేష్ బ్రదర్స్



**విజయవాడ, పెన్ సత్తా, నవంబరు03:** కల్తీ మద్యం కేసు లో అరెస్ట్ అయిన మాజీ మంత్రి జోగి రమేష్, ఆయన తమ్ముడు రాము ను నెల్లూరు సెంట్రల్ జైలు కు పోలీసులు సోమవారం తరలించారు. ఈ రోజు తెల్లవారుజామున న్యాయాధికారి రిమాండ్ విధించిన అనంతరం జోగి రమేశ్ ఆయన సోదరుడు రాము ను విజయవాడ జిల్లా జైలుకు తరలించారు. అయితే, కోర్టు ఆదేశాల మేరకు జోగి సోదరులను నెల్లూరు సెంట్రల్ జైలుకు ప్రత్యేక ఎస్కార్ట్ తో తరలించారు పోలీసులు.

# డిజిటల్ అరెస్టుల పై సుప్రీం సీరియస్..!

## 3 వేల కోట్లు కొట్టేయడం పై.. మండిపాటు

న్యూ దిల్లీ: దేశ వ్యాప్తంగా అంతకంతకూ పెరిగిపోతున్న డిజిటల్ అరెస్టుల వ్యవహారం పై అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు సోమవారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. డిజిటల్ అరెస్టుల పేరుతో ఇప్పటి వరకూ సైబర్ నేరస్తులు పేదలు, వృద్ధుల నుంచి 3 వేల కోట్లు కొట్టేయడం పై మండి పడింది. సైబర్ నేరస్తుల్ని ఉక్కు పిడికిలితో ఎదుర్కొనేలా ఆదేశాలు ఇస్తామని హెచ్చరించింది. డిజిటల్ అరెస్టుల వ్యవహారం పై సుమోటో గా కేసు నమోదు చేసి విచారణ

వివరాలు 2లో..



## పోలీసుల విచారణకు

# శ్యామల




**కర్నూలు, పెన్ సత్తా, నవంబర్ 03:** వైసీపీ అధికార ప్రతినిధి, యాంకర్ శ్యామల పోలీసుల విచారణ ముగిసింది. కర్నూలులో జరిగిన బస్సు ప్రమాదం పై దుష్ప్రచారం చేశారంటూ చేసిన వ్యాఖ్యల పై శ్యామల కు పోలీసులు నోటీసులు అందజేశారు. విచారణకు రావాల్సిందిగా నోటీసుల్లో పేర్కొన్నారు. ఈక్రమంలో సోమవారం వైసీపీ ప్రచార ప్రతినిధి శ్యామల విచారణకు వచ్చారు. కర్నూలు డీఎస్పీ ఆఫీసులో రెండు గంటల పాటు శ్యామలను డీఎస్పీ బాబు ప్రసాద్ విచారణ జరిపారు. దాదాపు 65 ప్రశ్నలు

వివరాలు 2లో..

# భాగస్వామ్య సదస్సులో 9.8 లక్షల కోట్ల పెట్టుబడులు

- 45 దేశాల నుంచి 300 మంది పారిశ్రామికవేత్తలు, ప్రముఖుల హాజరు
- 410 ఒప్పందాలపై సంతకాలు
- 2.5 లక్షల ఉద్యోగాలు కల్పించే కంపెనీలకు భూమిపూజ
- విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్



విశాఖపట్నంలో ఈ నెల 14, 15 తేదీల్లో జరగనున్న భాగస్వామ్య సదస్సుకు 45 దేశాలకు చెందిన 300 మంది పారిశ్రామికవేత్తలు, ప్రముఖులు

వివరాలు 2లో..

# మూడో కంటికి తెలియకుండా పాకిస్తాన్ అణు పరీక్షలు



## బాంబు పేల్చిన ట్రంప్

అమెరికా : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బాంబు పేల్చారు. పాకిస్తాన్ అణు పరీక్షలను నిర్వహిస్తోందని వెల్లడించారు, ఇది ఎప్పటి కైనా ప్రమాదకరమేనని తేల్చి చెప్పారు. ఈ నేపథ్యంలో తాము కూడా న్యూక్లియర్ పరీక్షలను తిరిగి ప్రారంభించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఇది ఊహించ లేదని, పాకిస్తాన్ చర్యలు ఆందోళనకు గురి చేస్తోన్నాయని పేర్కొన్నారు.

వివరాలు 2లో..

## జరుగుతున్నవి అన్ని డైవర్ట్ కోసమేనా?.. వర్మ అనుమానాలు



**కాకినాడ, పెన్ సత్తా, నవంబర్ 03:** ప్రభుత్వం ప్రజా సంక్షేమంతో ముందుకు వెళుతుంటే జగన్ అండ్ టీం వాటిని డైవర్ట్ చేస్తున్నారని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ ఆరోపించారు. సోమవారం వర్మ పత్రికల వారితో మాట్లాడుతూ కర్నూలులో కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ సభ హిట్ అయిన వెంటనే సింహాచలంలో గోడ కూలిపోయిందని తెలిపారు. మొంథా తుపాన్ వల్ల ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా చంద్రబాబు ప్రభుత్వం అప్రమత్తమైందని.. ఆ వెంటనే శ్రీకాకుళం ఆలయంలో ప్రమాదం జరిగిందని అన్నారు. చంద్రబాబు మంచి పని ప్రజల్లోకి వెళుతుంటే వెంటనే ఇన్సిడెంట్లు ఎందుకు అవుతున్నాయనే

వివరాలు 2లో..

# ఫ్లెమింగోల శాశ్వత నివాస స్థావరంగా తీర్చిదిద్దుతాం పవన్

### సైబీరియన్ పక్షుల రాక పై పవన్ ట్వీట్







**మంగళగిరి, నవంబర్ 03:** పులికాట్ సరస్సుకు శీతాకాలం అతిథుల రాక మొదలైందని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలిపారు. సైబీరియన్ పక్షుల రాక పై సోషల్ మీడియా ఎక్స్ వేదికగా పవన్ స్పందించారు. పులికాట్ సరస్సుకు సైబీరియన్ పక్షులు వస్తున్నాయని, వేల కిలోమీటర్లు ప్రయాణం చేసి వస్తున్న సైబీరియన్ పక్షులు, ఫ్లెమింగోలు అందరికీ కనువిందు చేయడానికి సిద్ధమయ్యాయన్నారు. ఆహారం, విశ్రాంతి నిమిత్తం ఆరు నెలలపాటు మన పులికాట్ పరిసరాల్లో ఉంటాయని తెలిపారు. అందుకే ప్రతి ఏటా ఈ నీటి పక్షుల రాకను 'ఫ్లెమింగో ఫెస్టివల్' పేరిట ఘనంగా వేడుక చేసుకుంటామన్నారు. మూడు రోజుల పండుగకు రాష్ట్రం నలుమూలల నుంచి ఏడు నుంచి ఎనిమిది లక్షల మంది పక్షి ప్రేమికులు హాజరవడం ఫ్లెమింగోలతో ఉన్న అనుబంధానికి నిదర్శనమని ఉప ముఖ్యమంత్రి అన్నారు. ముద్దుగా రాజహంస అని పిలుచుకునే ఫ్లెమింగోలు జీవ వైవిధ్యానికి ప్రతీకలుగా నిలుస్తాయన్నారు. అక్టోబర్ మాసంలో వచ్చి మార్చిలో తిరిగి వెళ్లిపోయే ఈ విదేశీ అతిథులు, ఏపీ ఆతిథ్యం నచ్చిందో ఏమో ఈ మధ్య ఏడాది పొడుగునా కనువిందు చేస్తున్నాయని అన్నారు. ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేసే కార్యక్రమంలో భాగంగా ఫ్లెమింగోలు ఇక్కడ స్థిర నివాసం ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా అటవీ శాఖ ఆధ్వర్యంలో అనుకూల పరిస్థితులు కల్పిస్తున్నామని వెల్లడించారు. ఫ్లెమింగోల ఆహారం, విశ్రాంతి, భద్రతకు ఇబ్బందులు కలగకుండా గత కొంత కాలంగా తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయన్నారు. ఈసారి మూడు రోజుల పండుగతో సరిపెట్ట కుండా ఎకో టూరిజాన్ని విస్తరించే ప్రక్రియలో భాగంగా ఫోటోగ్రఫీ, బర్డ్ సీయింగ్, ఎకో క్లబ్ పేరిట వివిధ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని తెలిపారు. మొంథా తుపానుకు ముందు నుంచే ఫ్లెమింగోల రాక మొదలయ్యిందని పవన్ అన్నారు. పెను గాలులు, భారీ వర్షాలకు వాటి స్థావరాలకు ఇబ్బంది కలగకుండా అటవీ శాఖ ఆధ్వర్యంలో తగు చర్యలు చేపట్టామన్నారు. రానున్న మూడు నెలలు ఫ్లెమింగోల రక్షణపై ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టాలని అటవీ అధికారులకు దిశానిర్దేశం చేశామని తెలిపారు. పులికాట్‌ను ఫ్లెమింగోల శాశ్వత నివాస స్థావరంగా మార్చేందుకు అనుకూలమైన పరిస్థితులు కల్పించేందుకు కృషి చేస్తున్నాంమన్నారు. భవిష్యత్తులో ఈ ప్రాంతాన్ని ఎకో టూరిజానికి గమ్యస్థానంగా తీర్చిదిద్దే విధంగా చర్యలు తీసుకుంటున్నామంటూ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ట్వీట్ చేశారు.

# ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన కంకర లారీ.. 19 మంది దుర్మరణం

-మొదటిపేజీ తరువాయి

ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెప్పారు.

**బస్సులో 72 మంది ప్రయాణికులు!**

టీఎస్ 34 టీఏ 6354 నంబరు గల ఆర్టీసీ బస్సు తాండూరు నుంచి హైదరాబాద్ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. తాండూరులో ఉదయం 4.40 గంటలకు బస్సు బయల్దేరింది. అక్కడ 30 మందికి పైగా ఉద్యోగులు, కళాశాలలకు వెళ్లే ఉద్యోగులు ఎక్కారు. మొత్తంపై బస్సులో సుమారు 72 మంది ప్రయాణికులు ఉన్నారు. విద్యార్థులు హైదరాబాద్‌లోని పలు కళాశాలల్లో చదువుతున్నట్లు సమాచారం. ఆదివారం సెలవు కావడంతో ఇళ్లకు వెళ్లి.. తిరిగి నగరానికి వస్తుండగా ఈ ఘటన జరిగింది. రోడ్డు ప్రమాదంతో హైదరాబాద్-బీజాపూర్ హైవేపై భారీగా ట్రాఫిక్‌జామ్ అయింది. చేవెళ్ల-వికారాబాద్ మార్గంలో పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి.

**15 మంది ప్రయాణికులను రక్షించిన పోలీసులు**

ఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు 15 మంది ప్రయాణికులతో పాటు బస్సు కండక్టర్ రాధను పోలీసులు రక్షించారు. కండక్టర్‌కు గాయాలు కావడంతో ఆమెను ఆస్పత్రికి తరలించారు. సహాయక చర్యలు జరుగుతున్న సమయంలో చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్‌పైకి జేసీబీ ఎక్కడంతో ఆయన ఎడమ కాలికి గాయమైంది. సీఐను చేవెళ్ల ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

# మూడో కంటికి తెలియకుండా పాకిస్తాన్ అణు పరీక్షలు

-మొదటిపేజీ తరువాయి

ఖఅమెరికా అణ్వస్త్ర పరీక్షలను చేపట్టక తప్పదని వ్యాఖ్యానించారు. సీబీఎస్ న్యూస్ 60 మినిట్స్ షోకు ఇచ్చిన ఇంటర్వ్యూలో డొనాల్డ్ ట్రంప్ మాట్లాడారు. అణ్వాయుధాల పరీక్షలు చేపట్టింది ఒక్క పాకిస్తాన్ మాత్రమే కాదని, ఇటువంటి వాతావరణం ఇతర దేశాల్లోనూ నెలకొని ఉందని అన్నారు. రష్యా, చైనా, ఉత్తర కొరియా అణు పరీక్షలు నిర్వహిస్తున్నాయని వివరించారు. తాము మాత్రమే ఈ చర్యలను నిలిపివేశామని, దీన్ని పునరుద్ధరించాల్సిన అవసరం తలెత్తు తోందని ట్రంప్ చెప్పారు. రష్యా, చైనా రహస్యంగా అణు పరీక్షలు చేస్తున్నాయని, దీని గురించి ప్రపంచ దేశాలు తప్పక మాట్లాడాల్సిన అవసరం ఉందని అన్నారు. ఎవరూ దీని గురించి ప్రస్తావించకపోతే ప్రమాదకరమని చెప్పారు. అణ్వాయుధ పరీక్షల గురించి ధైర్యంగా వార్తలు రాసే జర్నలిస్టులు ఆయా దేశాల్లో లేరని అన్నారు. ఉత్తర కొరియా, పాకిస్తాన్ సైతం అదే బాట పట్టాయని, చురుగ్గా అణు పరీక్షలు నిర్వహిస్తున్నాయని డొనాల్డ్ ట్రంప్

అన్నారు. వాళ్లు న్యూక్ టెస్టులు చేపట్టినందున అమెరికా కూడా పరీక్షలు చేస్తుందని ట్రంప్ స్పష్టం చేశారు. రష్యా, చైనా, ఉత్తర కొరియా, పాకిస్తాన్ అణు పరీక్షలు చేస్తుంటే, తాము మౌనంగా కూర్చోబోమని, ప్రపంచాన్ని 150 సార్లు నాశనం చేయడానికి సరిపడా అణు ఆయుధాలు తమ వద్ద ఉన్నాయని డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. పాకిస్తాన్ అనేది అమెరికా గుడ్‌బుక్స్‌లో లేదని, దాని కార్యకలాపాల పై నిఘా పెట్టామని పరోక్షంగా తెలియజేశారు. చైనా అనుకూల దేశంగా పాకిస్తాన్ కు ముద్రపడటం వల్ల ఆ దేశాన్ని డొనాల్డ్ ట్రంప్ ఎంత మాత్రం విశ్వసించట్లేదనేది మరోసారి తేటతెల్లమైంది. 1971 లో భారత్ తో జరిగిన యుద్ధం తర్వాత పాకిస్తాన్

అణు కార్యక్రమం మొదలైంది. 1970 దశకం మధ్యలో అప్పటి ప్రధాని జుల్ఫికర్ అలీ భుట్టో నాయకత్వంలో ఇది మరింత వృద్ధి చెందింది. 1980-90ల్లో రహస్యంగా న్యూక్లియర్ టెస్టులను నిర్వహించింది. చివరిసారిగా పాకిస్తాన్ 1998 మే 28 న బలూచిస్థాన్ లోని చాగిలో బహిరంగంగా అణు పరీక్షలు చేపట్టింది. భారత నిర్వహించిన పోఖ్రాన్-2 తర్వాత ఈ పరిణామం చోటు చేసుకుంది.

# భాగస్వామ్య సదస్సులో 9.8 లక్షల కోట్ల పెట్టుబడులు

-మొదటిపేజీ తరువాయి

హాజరుకానున్నారని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. ఈ సదస్సులో 410 ఒప్పందాలపై సంతకాలు చేయబోతున్నామని.. వీటి ద్వారా రూ.9.8 లక్షల కోట్ల పెట్టుబడులు, 7.5 లక్షల ఉద్యోగాలు వస్తాయని వివరించారు. సదస్సు సందర్భంగా రూ.2.7 లక్షల కోట్ల పెట్టుబడులు, 2.5 లక్షల ఉద్యోగాలు కల్పించే కంపెనీలకు భూమిపూజ చేయబోతున్నామని ప్రకటించారు. భాగస్వామ్య సదస్సు ఏర్పాట్లపై లోకేశ్ సోమవారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. అనంతరం సహచర మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, గొట్టిపాటి రవికుమార్, కొల్లు రవీంద్ర, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్‌లతో కలిసి ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. 'కూటమి పాలనలో రాష్ట్రానికి ఇప్పటి వరకు రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. దేశీయ పెట్టుబడుల్లోనే కాకుండా ఎఫ్‌డీఐల్లోనూ ఏపీ నంబర్ వన్‌గా నిలుస్తోంది. రాబోయే పదేళ్లలో పారిశ్రామిక రంగంలో రానున్న మార్పులు, అందులో భారత్, ఏపీ పాత్ర ఏమిటి తదితర అనేక అంశాలపై విశాఖ సదస్సులో చర్చలు ఉంటాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికలప్పుడు చెప్పాం. ఆ హామీ నెరవేర్చేందుకు మంత్రులందరం మిషన్ మోడ్‌లో పని చేస్తున్నాం.

**స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తోనే..**

ప్రభుత్వం, ప్రజలు, పారిశ్రామికవేత్తలు కలిసికట్టుగా ముందుకు సాగితేనే ఏపీ అగ్రపథాన పయనిస్తుంది. నిన్న ముంబయిలో క్రికెట్ మ్యాచ్‌కు వెళ్లినప్పుడూ పలువురు పారిశ్రామికవేత్తలను కలిశాను. సీఎం చంద్రబాబు సమర్థ నాయకత్వం, డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాల వల్ల కంపెనీలు తమ పెట్టుబడులకు ఏపీని ఎంచుకుంటున్నాయి. పక్క రాష్ట్రాలు పోటీపడి ప్రోత్సాహకాలిస్తున్నా ఏపీ వైపు మొగ్గుచూపడానికి స్పీడ్ ఆఫ్ డూయింగ్ విధానాలే కారణం. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు సమన్వయం వల్లే గూగుల్ లాంటి భారీ పెట్టుబడి రాష్ట్రానికి వచ్చింది. కేంద్రం అనుమతించడంతో ఆర్సెలార్ మిత్తల్ సంస్థ రూ.లక్షన్నర కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చింది. అభివృద్ధి వికేంద్రీకరణ, అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధే మా ప్రభుత్వ ధ్యేయం. ఏపీలో ఆరు గిగావాట్ల డేటా సెంటర్ల ఏర్పాటు, అందుకు అవసరమైన గ్రీన్ ఎనర్జీ, ఎకో సిస్టమ్‌ను తీసుకురావాల్సి ఉంది. ఉభయ గోదావరి జిల్లాల్లో ఆక్వా పరిశోధనలకు ఆస్ట్రేలియాలోని జేమ్స్ కుక్ వర్సిటీ, క్రీడాభివృద్ధికి గ్రిఫిత్ వర్సిటీ, సోలార్ సెల్, క్వాంటం వ్యాలీ అభివృద్ధికి ఇతర ఆస్ట్రేలియా వర్సిటీలతో మాట్లాడుతున్నాం. ఈ నెలలో చాలా కంపెనీల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ఉంటాయి.

**ఏఐతో అభ్యర్థుల సామర్థ్యం మదింపు**

త్వరలో నైపుణ్యం పోర్టల్ ప్రారంభించబోతున్నాం. ఈ పోర్టల్‌లో బైక్ మెకానిక్ నుంచి క్వాంటమ్ ఇంజినీర్ వరకు ఏఐ సాంకేతికతతో అభ్యర్థుల నైపుణ్యాలను అంచనా వేస్తాం. పరిశ్రమలతో నిరుద్యోగుల జాబితా అనుసంధానం చేస్తాం.

**ఒక్క రాత్రిలోనే అద్భుతాలు జరగవు**

రాష్ట్రం కోసం అందరం కలిసికట్టుగా పని చేద్దాం. ప్రతిపక్షంలో ఉన్న వైకాపా వాళ్లకు తెలిసిన కంపెనీలను తీసుకొచ్చినా క్రెడిట్ వారికే ఇస్తాం. ఒకే ప్రభుత్వం ఎక్కువకాలం కొనసాగినచోట రాష్ట్రాలు అభివృద్ధి చెందుతున్నాయి. ఒక్క రాత్రిలోనే అద్భుతాలు జరగవు. ఐదేళ్ల వైకాపాలో

అరాచక పాలన చూశాం. ఇప్పుడు పెట్టుబడులులాంటి పాజిటివ్ వార్తలు చూస్తున్నారు. గత ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను సమీక్షిస్తున్నాం. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడాలని మేం అడగడం వల్లే కేంద్రం రూ.13 వేల కోట్ల రాయితీలు ఇచ్చింది. దీన్ని మరింత సమర్థంగా నిర్వహించాలి. ఏపీ ప్రభుత్వం సైతం కర్మాగారంలో వాటాదారు' అని లోకేశ్ చెప్పారు.

# జరుగుతున్నవి అన్ని డైవర్ట్ కోసమేనా?.. వర్మ అనుమానాలు

-మొదటిపేజీ తరువాయి

ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయని, ఇటువంటి ఘటనల పై ప్రజల్లో అనుమానాలు ఉన్నాయని, వీటి పై డీజీపీ విచారణ జరపాలని కోరారు. కూటమి సుపరిపాలన నుంచి ప్రజలను డైవర్ట్ చేయడానికి ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేయాలని దురుద్దేశంతో చేస్తున్నారా అని ప్రశ్నించారు. చంద్రబాబు నిమిషంలో ఫీల్డ్ లో దిగారని, జగన్ మాత్రం ప్యాలెస్ లోనే కూర్చున్నారని విమర్శించారన్నారు. సీఎం రిస్క్ చేసి మరీ ఫీల్డ్‌కు వచ్చారని తెలిపారు. జగన్ ఇప్పటి వరకు ప్యాలెస్ నుంచి ఎందుకు బయటకు రాలేదని నిలదీశారు. తుపానుపై సీఎం చంద్రబాబు అడుగడునా అప్రమత్తమై పనిచేశారని తెలిపారు. గత ఐదేళ్లలో సీఎంగా జగన్ రాష్ట్రానికి ఏం వెలగబెట్టారో చెప్పాలని డిమాండ్ చేశారు. విపత్తుల సమయంలో జగన్ ఎప్పుడైనా పర్యటించారా.. గాలిలో తిరగడం తప్ప ఏం చేశారంటూ ఫైర్ అయ్యారు. కష్టం వస్తే చంద్రబాబు 5 నిమిషాల్లో అక్కడ ఉంటున్నారని తెలిపారు. గత వైసీపీ హయాంలో ఐదు ప్రకృతి విపత్తులు వచ్చాయని, అయినా ఏనాడు ప్రజలను ఆదుకోలేదని దుయ్యబట్టారు. 30 వేల కోట్లు రైతుల నష్టపోతే మీరు ఇచ్చింది కేవలం రూ.2 వేల కోట్లు మాత్రమే అంటూ మాజీ ఎమ్మెల్యే వర్మ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

# జోగి రమేష్ కుటుంబసభ్యులు, అనుచరుల పై కేసు నమోదు





**విజయవాడ, పెన్ సత్తా, నవంబర్ 03:** మాజీ మంత్రి జోగి రమేష్ కుటుంబ సభ్యులు, అనుచరుల పై కేసు నమోదు అయ్యింది. నిన్న (ఆదివారం) విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో జోగి అనుచరులు హడావుడి చేసిన విషయం తెలిసిందే. పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతో పాటు ప్రభుత్వాస్పత్రి అద్దాలను ధ్వంసం చేశారు. ఈ క్రమంలో విజయవాడ మాచవరం పోలీస్ స్టేషన్ లో జోగి కుటుంబ సభ్యులు, అనుచరుల పై పోలీసులు కేసు నమోదు చేశారు. జోగి రమేష్ కుటుంబ సభ్యుల పై ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం కేసు నమోదు అయ్యింది. కల్తీ మద్యం కేసులో మాజీ మంత్రి జోగి రమేష్‌తో పాటు ఆయన సోదరుడు జోగి రాముకు ఈ నెల 13 వరకు కోర్టు రిమాండ్ విధించింది. ఈ క్రమంలో వారిని వైద్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి పోలీసులు తరలించారు. జోగిని ఆస్పత్రికి తరలించిన సమయంలో ఆయన అనుచరులు భారీగా అక్కడకు చేరుకున్నారు. అనుచరులతో కలిసి భార్య శకుంతల, కుమారులు రాజీవ్, రోహిత్ ప్రభుత్వాస్పత్రికి చేరుకున్నారు. ఆస్పత్రి వద్ద జోగి అనుచరులు, వైసీపీ కార్యకర్తలు ఆందోళన చేశారు. ఈ క్రమంలో అక్కడ జరిగిన తోపులాటలో ఆస్పత్రి అద్దాలను జోగి అనుచరులు ధ్వంసం చేశారు. ఈ వ్యవహారం పై స్పందించిన పోలీసులు జోగి కుటుంబసభ్యులు, అనుచరుల పై ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం కేసును నమోదు చేశారు.

# పోలీసుల విచారణకు శ్యామల

-మొదటిపేజీ తరువాయి

సంధించినట్లు తెలుస్తోంది. బస్సు ప్రమాదం ఘటనకు సంబంధించి చేసిన వ్యాఖ్యల పై ఆధారాలు చూపాలని డీఎస్పీ కోరినట్లు సమాచారం. విచారణ అనంతరం శ్యామల మీడియాతో మాట్లాడుతూ విచారణలో పోలీసులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పానని అన్నారు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా బస్సు నడపలేదా?, బైకర్స్ బెల్టు షాపులో మద్యం తాగలేదా ? అంటూ బస్సు ప్రమాదం పై మరోసారి శ్యామల సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే విచారణలో పోలీసులు అడిగిన ప్రశ్నలకు శ్యామల ఉక్కిరిబిక్కిరి అయినట్లు తెలుస్తోంది. బస్సు ప్రమాదం పై నాకు ఎలాంటి అవగాహన లేదు. నేను బస్సు ప్రమాదం ఘటనా స్థలానికి వెళ్ల లేదు. వి కావేరి ట్రావెల్స్ బస్సు యాజమాన్యం, బస్సు డ్రైవర్ లతో, మద్యం తాగిన బైకర్‌లతో మాట్లాడలేదు. పార్టీ ఆదేశాల మద్యం తాగడం వల్లే ప్రమాదం జరిగిందంటూ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ కర్నూలుకు చెందిన వ్యక్తి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు యాంకర్ శ్యామల, సీవీ రెడ్డి సహా 27 మంది పై కేసు నమోదు చేసి విచారణకు రావాల్సిందిగా నోటీసులు జారీ చేశారు.

# డిజిటల్ అరెస్టుల పై సుప్రీం సీరియస్..!

-మొదటిపేజీ తరువాయి

జరుపుతున్న సుప్రీం కోర్టు ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. డిజిటల్ అరెస్టుల పేరుతో దేశంలో 3 వేల కోట్ల స్కాం జరగడం పై జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వం లోని సుప్రీం కోర్టు ధర్మాసనం ఇవాళ తీవ్రంగా స్పందించింది. ఈ వ్యవహారం పై అందరి అభిప్రాయాలు తీసుకున్న తర్వాత చర్యలకు సిఫార్సులు చేసేందుకు అమికస్ క్యూరీ (కోర్టు సహాయకుడు)గా సీనియర్ న్యాయవాది ఎన్ఎస్ నప్పినాయ్ ను నియమిస్తున్నట్లు తెలిపింది. ఈ వ్యవహారాన్ని ఇక్కడితో వదిలేస్తే, తీవ్ర నిర్ణయాలు ప్రకటించకపోతే సమస్య మరింత పెద్దవుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. డిజిటల్ అరెస్టుల పై వాదనలు వినిపించేందుకు కేంద్రం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ స్కాంలో బాధితులు ఎక్కువగా వృద్ధులు కావడం బాధాకరమని తెలిపారు. ఇలాంటి కేసుల్ని ఎదుర్కొనేందుకు హోంశాఖలో ఓ ప్రత్యేక విభాగం ఉందని, సమయం ఇస్తే కోర్టుకు పూర్తి వివరాలు తెలియజేస్తామని వెల్లడించారు. దీంతో ఈ సమస్యను పరిష్కరించాల్సిన అవసరం డొమైన్ నిపుణులకు ఉండవచ్చని కోర్టు తెలిపింది. ఇది చాలా పెద్ద సవాలు అని, చాలా షాకింగ్ విషయమని తెలిపింది. ఇతర దేశాలలో ఏం జరుగుతుందో తమకు తెలియదని, సాంకేతిక, ఆర్థిక స్తంభాలు ఎలా పనిచేస్తున్నాయో తెలియదని న్యాయమూర్తి తెలిపారు. అయితే వాటి సామర్థ్యాలను మనం మాత్రం బలోపేతం చేసుకోవాలన్నారు. మనం తడబడితే లేదా విస్మరిస్తే, కఠినమైన ఆదేశాలు జారీ చేయకపోతే, సమస్య మరింత తీవ్రమవుతుందని తెలిపారు. హోం శాఖ నుండి అందిన సీల్డ్ నివేదిక ఆధారంగా తన కార్యాలయం ఒక సంక్షిప్త నివేదికను రూపొందించిందని, కొన్ని ఉపయోగకరమైన సూచనలు వచ్చాయని జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. నవంబర్ 10 న సంక్షిప్త విచారణ తర్వాత దీనిపై తగిన ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు.

# మోస్ట్ పవర్ ఫుల్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ కలిగిన దేశాలు ఇవే.



**ఇంటర్నెట్ డెస్క్: పెన్ సత్తా, నవంబర్ 03:** దేశ రక్షణలో తగ్గేదేలే అన్నట్లుగా ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ దూసుకెళుతున్నాయి. దేశం పైకి వచ్చే విమానాలు, డ్రోన్ లు, క్షిపణులను రాడార్ వ్యవస్థ సాయంతో గుర్తించి తక్షణమే నేల కూల్చుతున్నాయి. ఇటీవలి కాలంలో ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో ఉద్రిక్తతలు, సరిహద్దు వివాదాలు, ఆధిపత్య పోరు నెలకొన్న క్రమంలో ప్రతి దేశం ఇప్పుడు ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల పై ఆసక్తి చూపిస్తోంది. యుద్ధ రంగం లోనూ అత్యాధునిక టెక్నాలజీని జోడించిన నేపథ్యంలో ప్రస్తుతం అనేక దేశాలు ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ ను అలవరచుకుంటున్నాయి. ప్రస్తుతం అత్యాధునిక యుద్ధ వాతావరణంలో ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ ప్రాముఖ్యత పెరుగుతోంది. ఈ వ్యవస్థలు శత్రు దేశాల నుంచి వచ్చిన డ్రోన్లు, మిసైల్స్ ను టార్గెట్ పాయింట్ కు రీచ్ కాకముందే రాడార్ వ్యవస్థ సాయంతో గుర్తించి, వాటిని ట్రాకింగ్ చేసి, ఎయిర్ క్రాఫ్ట్ తో ఢీ కొట్టి భస్మీపటలం చేస్తాయి. ఏ ఏ దేశాల్లో ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు శక్తివంతంగా ఉంటే ఆ దేశాలు శత్రు దాడుల నుంచి ఏరియల్ దాడులను తిప్పికొడుతున్నాయి. మరి ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల్లో ఏ దేశాలు టాప్ లో ఉన్నాయో చూద్దాం. ఎయిర్ డిఫెన్స్ టెక్నాలజీలో అమెరికా టాప్ ప్లేస్ లో ఉంది. అమెరికా లోని ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ లో పాట్రియాట్(ప్యాక్ -3), థాడ్ తాడ్ (టెర్మినల్ హై అల్టిట్యూడ్ ఏరియా డిఫెన్స్) రక్షణ వ్యవస్థలు ముఖ్య పాత్ర పోషిస్తున్నాయి. ఈ రక్షణ వ్యవస్థలకు ఎయిర్ క్రాఫ్ట్ , క్రూయిజ్ మిసైల్స్, మరికొన్ని బాలిస్టిక్ మిసైల్స్ ను అడ్డుకునే శక్తిని కలిగి ఉంటాయి . ప్రస్తుతం అమెరికా హైపర్ సోనిక్ డిఫెన్స్ టెక్నాలజీస్ మీద అధికంగా పెట్టుబడులు పెడుతోంది. అంతరిక్ష సంబంధిత సెన్సార్లు తదితర సాంకేతికత కారణంగా ప్రపంచం లోనే శక్తివంతమైన ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థను కలిగి ఉంది. ఇక రెండో స్థానంలో రష్యా ఉంది. ప్రస్తుతం రష్యా వద్ద ఎస్-400, ఎస్-500 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ కలిగి ఉన్నాయి. ఎస్-400 రక్షణ వ్యవస్థ, 400 కిలో మీటర్లకు మించిన రేంజ్ వరకు లక్ష్యాలను ఛేదించగలదు. ఇక ఎస్-500 రక్షణ వ్యవస్థ అత్యధిక ఎత్తు నుంచి దేశంవైపునకు వచ్చే బాలిస్టిక్, హైపర్ సోనిక్ క్షిపణులను అడ్డుకుంటుంది. రష్యా భూ భాగం మొత్తం ఈ రాడార్ వ్యవస్థ కవరేజీలో ఉంది. ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలో చైనా మూడో స్థానంలో ఉంది. చైనా లో హెచ్ క్యూ- 9, అలాగే హెచ్ క్యూ-22 వ్యవస్థలను సుదూర ప్రాంతాల నుంచి వచ్చే డ్రోన్ లు, క్షిపణులను అడ్డుకునేందుకు వీలుగా రూపొందించారు. సౌత్ అండ్ ఈస్ట్ చైనా సముద్రం పై నిఘా కోసం ఈ వ్యవస్థలకు అడ్వాన్స్ డ్ రాడార్ వ్యవస్థ, కమాండ్ లింక్స్ ను అమర్చారు. ఇజ్రాయెల్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ నాలుగో స్థానంలో ఉంది. ఆకాశ మార్గంలో మూడంచెల పర్యవేక్షణను ఇజ్రాయెల్ కలిగి ఉంది. షార్ట్ రేంజ్ రాకెట్స్ కు ఐరన్ డోమ్ వ్యవస్థ ఉంది. మీడియం రేంజ్ త్రెట్స్ కు డేవిడ్స్ స్లింగ్ ఉంది. అలాగే లాంగ్ రేంజ్ బాలిస్టిక్ మిసైల్స్ కు యారో వ్యవస్థ కలిగి ఉంది. ఈ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు ఎంతో కచ్చితత్వంతో పనిచేస్తాయి. ఇక ఐదో స్థానంలో భారత్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ఉంది. ఆసియా ఖండం లోనే మోస్ట్ అడ్వాన్స్ డ్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థగా భారత్ నిలిచింది. భారత్ లో ప్రస్తుతం ఎస్-400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ ఉంది. పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్ పై భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ లో పాకిస్థాన్ కు చుక్కలు చూపించింది. ఈ ఎస్-400 ఎయిర్ డిఫెన్స్ రక్షణ వ్యవస్థను రష్యా నుంచి భారత్ కొనుగోలు చేసింది. భారత్- పాకిస్థాన్ ఉద్రిక్తతల సమయంలో పాకిస్థాన్ భారత్ పై సంధించిన డ్రోన్ లు, క్షిపణులను ఎస్-400 ఎయిర్ డిఫెన్స్ మిసైల్ సిస్టమ్ సమర్థవంతంగా తిప్పికొట్టింది. ప్రస్తుతం ఎస్-400 ప్రపంచం లోని అత్యుత్తమ వైమానిక రక్షణ వ్యవస్థలలో ఒకటిగా ఉంది. 600 కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాన్ని ట్రాకింగ్ చేసే సత్తా ఈ వైమానిక రక్షణ వ్యవస్థకు ఉంది.

# రోజూ చస్తూ బతుకుతున్నా విమాన ప్రమాద మృత్యుంజయుడు



**ఇంటర్నెట్ డెస్క్: పెన్ సత్తా, నవంబర్ 03::** యావత్ దేశాన్ని కలచివేసిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో ప్రాణాలతో బయటపడ్డ ఒకే ఒక్కడు విశ్వాస్ కుమార్ రమేష్. జూన్ 12, 2025 న గుజరాత్ లోని అహ్మదాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ నుంచి టేకాఫ్ అయిన కొద్ది సేపటికే ఎయిర్ ఇండియా కుప్పకూలిన ఘటనలో విమానం లోని 242 మంది ప్రయాణికుల్లో 241 మంది మరణించగా ఒకే ఒక్కడు విశ్వాస్ కుమార్ రమేష్ ప్రాణాలతో బయటపడ్డాడు. అయితే తాజాగా యూకే కు చెందిన న్యూస్ ఛానెల్ విశ్వాస్ కుమార్ ని ఇంటర్వ్యూ చేసింది. ఈ క్రమంలో ఆయన కీలక విషయాలను వెల్లడించారు. ఈ ఘటన జరిగి నాలుగు నెలలు కావస్తున్నా తాను ఇంకా శారీరకంగా, మానసికంగా బాధను అనుభవిస్తున్నట్లు తెలిపారు. స్కై న్యూస్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో విశ్వాస్ కుమార్ రమేష్ ఈ విషయాలను వెల్లడించారు. ఈ విమాన ప్రమాదంలో తన సోదరుడు మృతి చెందాడన్న విషయాన్ని తాను ఇంకా జీర్ణించుకోలేక పోతున్నానని తెలిపారు. నాకు అన్నీ అతనే, అతడు నాకు వెన్నెముక లాంటివాడు. అతడు లేడన్న సంగతి నేను ఇంకా నమ్మలేకపోతున్నా అని రమేష్ చెప్పుకొచ్చాడు. తాను ఇంకా మోకాలి, భుజం, వెన్నెముక నొప్పితో బాధపడుతున్నట్లు స్పష్టం చేశారు. మెట్లు ఎక్కడం నడవడం ఇబ్బంది కరంగా ఉన్నట్లు తెలిపాడు. తన ఫ్యామిలీ విషయాలను కూడా వెల్లడించాడు రమేష్. తన కుమారుడికి నాలుగున్నరేళ్లు ఉంటాయని, విమాన ప్రమాదం జరిగినప్పటినుంచి తాను కుమారుడితో సరిగ్గా మాట్లాడలేకపోతున్నానని తెలిపాడు. రోజంతా బెడ్ పైనే కూర్చునేవాడినని చెప్పుకొచ్చాడు. ఆ విమాన ప్రమాద జ్ఞాపకాలు తనను వెంటాడుతున్నాయని తెలిపాడు. నేను ఇప్పుడు ఒంటరిగా ఉన్నాను. నేను ఒక్కడినే రూమ్ లో కూర్చొంటున్నాను. నా భార్య తోనూ, నా కుమారుడి తోనూ మాట్లాడడం లేదు. నేను ఒంటరిగా ఉండేందుకే ఇష్ట పడుతున్నాను. నా పరిస్థితి దృష్ట్యా నా కుటుంబం నాతో సరిగ్గా మాట్లాడడం లేదు. నాతో పాటు నా కుటుంబం కూడా శారీరకంగా, మానసికంగా ఆవేదన చెందుతుంది. మా అమ్మ నాలుగు నెలలుగా నాతో మాట్లాడడం లేదు. నేనూ ఎక్కువగా మాట్లాడలేక పోతున్నా. నేను రాత్రంతా ఆలోచన చేస్తున్నా, నేను శారీరకంగా, మానసికంగా బాధపడుతున్నా. కుటుంబం మొత్తానికి ప్రతిరోజూ బాధాకరంగా ఉంటోంది అని విశ్వాస్ కుమార్ రమేష్ చెప్పు కొచ్చాడు. విశ్వాస్ కుమార్ రమేష్ ప్రస్తుతం పోస్ట్ ట్రామాటిక్ స్ట్రెస్ డిజార్డర్ తో బాధపడుతున్నట్లు అతడి కుటుంబ సభ్యులు చెప్పుకొచ్చారు. అతను శారీకరంగా బాధతోపాటు సైకలాజికల్ ట్రామాలో ఉన్నట్లు తెలిపారు. కొన్ని రోజుల క్రితం అతడు అర్ధరాత్రులు నిద్ర లేచేవాడని, భయపడేవాడని అతడి కజిన్ తెలిపాడు. సైకియాట్రిస్ట్ దగ్గరకు తీసుకెళ్లినట్లు తెలిపాడు. ఇక ఎయిర్ ఇండియా రమేష్ కు నష్టపరిహారం కింద రూ. 22 లక్షలు ఇచ్చేందుకు అంగీకరించింది. ఆ మొత్తాన్ని రమేష్ స్వీకరించాడు.

# రైతులు మార్కెట్ యార్డు లోని సదుపాయాలను వినియోగించుకోవాలి

**పుట్టపర్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ పూల శివప్రసాద్**

**పుట్టపర్తి, పెన్ సత్తా, నవంబర్ 03:** పుట్టపర్తి కొత్త చెరువు తేరు వద్ద రోడ్డు పైన ఆరబోసిన వరి ధాన్యాన్ని మార్కెట్ యార్డ్ చైర్మన్ పూల శివప్రసాద్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రోడ్ల మీద ధాన్యం ఆరబోస్తే, వాహనాలు తిరుగుతున్నప్పుడు రైతులు ప్రమాదాల బారిన పడే అవకాశాలు ఉన్నాయని అలాగే ట్రాఫిక్ కి కూడా అంతరాయం జరుగుతుందని, కావున రైతులు కొత్త చెరువు మార్కెట్ యార్డులో ధాన్యాన్ని నిల్వ ఉంచుకొనుటకు,



ఆరబోసు కోవడానికి ఉచితంగా సౌకర్యం కల్పిస్తున్నామని, వాటిని సద్వినియోగ పరచుకోవాలని, రైతులు యార్డులో ధాన్యాన్ని నిల్వ ఉంచుకుంటే సురక్షితమని తెలిపారు. రైతుల సంక్షేమమే పరమావధిగా మన కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, రైతులు క్షేమంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని, ముమ్ముందు రైతుల కోసం వసతి సౌకర్యాలు, జీవాల కోసం నీటి తొట్టెలు లాంటి మరేన్నో సదుపాయాలు మార్కెట్ యార్డులో కల్పిస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన ప్రధాన కార్యదర్శి హనుమంతు నాయక్, మార్కెట్ యార్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

# తుఫాన్ ప్రభావంతో నేల కోరిగిన తమలపాకు తోటలు పరిశీలించిన గుడివాడ

**పాయకరావుపేట, పెన్ సత్తా, నవంబర్ 03:** పాయకరావుపేట మండలం సత్యవరం గ్రామంలో మొంథా తుఫాన్ ప్రభావంతో చేతికి అంది వచ్చిన తమలపాక తోటలు పూర్తిగా చేజారిపోయింది. సోమవారం మాజీ మంత్రి, అనకాపల్లి జిల్లా వైసిపి అధ్యక్షులు, చోడవరం నియోజవర్గ సమన్వయకర్త గుడివాడ అమర్నాథ్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ ఈ తోటలు పరిశీలించారు. ఈ కార్యక్రంలో పాయకరావుపేట నియోజకవర్గం సమన్వయకర్త కంబాల జోగులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శులు వీసం రామకృష్ణ, చిక్కల రామారావు, పాయకరావుపేట మండలం పార్టీ అధ్యక్షులు గడ్డమూరి శ్రీనివాసరావు, యస్.రాయవరం మండలం పార్టీ అధ్యక్షులు మధువర్మ , వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు...



# తుఫాన్ సేవలలో ప్రతిభ చూపిన తహసీల్దార్ ని సత్కరించిన కలెక్టర్.




**చిలకలూరిపేట, పెన్ సత్తా, నవంబర్ 03:** తుఫాన్ సమయంలో ప్రజలకు అత్యవసర సేవలను అందించిన అధికారులు, సిబ్బందిని ప్రోత్సహిస్తూ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం అభినందన సభ జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తుఫాన్ సమయంలో వేగంగా స్పందించి, పట్టుదలతో సేవలందించిన చిలకలూరిపేట ఎమ్మార్వో షేక్ మహమ్మద్ హుస్సేన్ ను కలెక్టర్ కృతికా శుక్లా సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విపత్తు సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడడంలో ప్రభుత్వ సిబ్బంది చూపిన చురుకుదనం ప్రశంసనీయమని తెలిపారు. భవిష్యత్తులో కూడా అదే నిబద్ధతతో ప్రజా సేవలను అందించాలని ఆమె సూచించారు. తుఫాన్ సమయంలో సమన్వయంతో పనిచేసిన అధికారులందరికీ ప్రశంసలు అందజేయడంతో పాటు, విపత్తు నిర్వహణలో చిలకలూరిపేట మండల యంత్రాంగం కీలక పాత్ర పోషించిందని కలెక్టర్ అభినందించారు.

## పున ప్రారంభం అయిన పాపి కొండల బోటింగ్





**గోదావరి, పెన్ సత్తా, నవంబర్ 03:** గోదావరి ఒడ్డున సుందర దృశ్యాలతో ఆకర్షించే పాపికొండల్లో మరోసారి పర్యాటక సందడి మొదలైంది. పోలవరం ప్రాజెక్టు సమీపం లోని గండి పోచమ్మ వద్ద అధికారులు బోటింగ్ కార్యకలాపాలకు మళ్లీ అనుమతి ఇచ్చారు. నిన్న రెండు బోట్లలో మొత్తం 103 మంది పర్యాటకులు ప్రయాణించి ప్రకృతి అందాలను ఆస్వాదించారు. వాస్తవానికి దీపావళి ముందు నుంచే బోటింగ్ సేవలు ప్రారంభమయ్యాయి. అయితే ఆ తరువాత వచ్చిన భారీ వర్షాలు, గోదావరి నదిలో పెరిగిన వరద ప్రవాహం కారణంగా భద్రతా దృష్ట్యా బోటింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేశారు. ప్రస్తుతం వాతావరణం సాధారణ స్థితికి చేరడంతో, అధికారులు అన్ని భద్రతా ఏర్పాట్లు చేసి బోటింగ్‌ను తిరిగి ప్రారంభించారు. పాపి కొండలు ఆంధ్రప్రదేశ్‌లో అత్యంత అందమైన పర్యాటక కేంద్రముగా పేరు గాంచాయి. నదీ తీరంలో ఉన్న పచ్చని కొండలు, ప్రశాంతమైన గోదావరి ప్రవాహం, మధ్యలో సాగుతున్న బోట్లు పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తాయి. కార్తీక మాసం సందర్భంగా పాపి కొండలకు భక్తులు, పర్యాటకులు విపరీతంగా తరలివచ్చే అవకాశం ఉంది. ప్రత్యేకంగా ఈ సీజన్‌లో ప్రకృతి సోయగాలు మరింత చక్కగా కనువిందు చేస్తాయి. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి బోటు ప్రయాణం చేయాలనుకునే వారికి ఇది మంచి అవకాశం అవుతుంది. అటు అధికారులు కూడా పర్యాటకుల భద్రత పై ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రతి బోటులో లైఫ్ జాకెట్లు, రక్షణ సిబ్బంది, ఎమర్జెన్సీ కమ్యూనికేషన్ సదుపాయాలను ఏర్పాటు చేశారు. బోటింగ్ సమయాలు కూడా నియమ నిబంధనలకు అనుగుణంగా నిర్ధారించారు. పర్యాటక శాఖ పాపి కొండలను మరింత అభివృద్ధి చేసేందుకు పలు కొత్త ప్రాజెక్టులను ప్రణాళిక లోకి తీసుకువచ్చింది. దీంతో రాబోయే రోజుల్లో పాపి కొండలు రాష్ట్ర పర్యాటకానికి కేంద్ర బిందువుగా మారే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు.

## ప్రపంచం లోనే అత్యధిక అణ్వాయుధాలు కలిగిన దేశాలు ఇవే..



**ఇంటర్నెట్ డెస్క్: పెన్ సత్తా, నవంబర్ 03**స్టాక్ హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్ స్టిట్యూట్(సిప్రి) నివేదిక ప్రకారం ప్రపంచం లోని 9 దేశాల వద్ద మొత్తం 12,241 అణ్వాయుధాలు ఉన్నాయి. ఈ దేశాల లిస్ట్ లో భారత్ కూడా ఉంది. అమెరికా, రష్యా వద్ద అత్యధిక స్థాయిలో న్యూక్లియర్ వెపన్స్ ను కలిగి ఉన్నాయి. ఈ రిపోర్టు ప్రకారం 2,100 వార్ హెడ్స్ హై అలర్ట్ లో ఉన్నాయి. ప్రపంచం లోని అన్ని దేశాలు న్యూ క్లియర్ మోడ్రనైజేషన్ ప్రోగ్రామ్ ను అలవరచుకుంటున్నాయి. కొన్ని పాత ఆయుధాలు రిటైర్ అవుతుండగా కొత్తవి రీ ప్లేస్ అవుతున్నాయి. ఇటీవల ఇజ్రాయిల్- ఇరాన్ మధ్య భీకర యుద్ధం జరిగిన విషయం తెలిసిందే. ఇరు దేశాలు ఒకదాని పై మరొకటి బాంబుల వర్షం కురిపించుకున్నాయి. దీంతో మూడో ప్రపంచ యుద్ధం వస్తుందని అందరూ భయాందోళన చెందారు. ఈ క్రమంలో ఇరు దేశాల మధ్య అమెరికా జోక్యం చేసుకుంది. టెహ్రాన్ లోని అన్ని న్యూక్లియర్ సైట్స్ ను ధ్వంసం చేసింది. అయితే ఇరాన్ మాత్రం అమెరికా చర్యలను కొట్టిపారేసింది. ఈ క్రమంలో సిప్రీ నివేదిక ప్రకారం ప్రపంచం లోనే అత్యధిక అణ్వాయుధాలు కలిగిన దేశాల లిస్టు ఈ విధంగా ఉంది. ఈ లిస్టులో అమెరికా, రష్యా, యూకే, ఫ్రాన్స్, చైనా, పాకిస్థాన్, ఇజ్రాయిల్, నార్త్ కొరియా ఉన్నాయి. రష్యా అత్యధికంగా 5,459 న్యూ క్లియర్ వెపన్స్ ను కలిగి ఉంది. ఆ తర్వాత అమెరికా 5,177 న్యూ క్లియర్ వెపన్స్ ను కలిగి ఉంది. ఆ తర్వాత చైనా(600), ఫ్రాన్స్(290), యూకే(225), భారత్(180), పాకిస్థాన్(170), ఇజ్రాయెల్(90), నార్త్ కొరియా(50) ఉన్నాయి. సిప్రీ నివేదిక, 2025 ప్రకారం అన్ని దేశాలు న్యూ క్లియర్ మోడ్రనైజేషన్ ప్రోగ్రామ్స్ లో భాగంగా న్యూక్లియర్ వెపన్స్ ను మోడ్రనైజ్ చేసుకుంటున్నాయి. 12,241 న్యూక్లియర్ వెపన్స్ లో 3,912 వెపన్స్ మిసైల్స్, ఎయిర్ క్రాఫ్ట్ లో అమర్చారు. మరో 2,100 వార్ హెడ్స్ బాలిస్టిక్ మిసైల్స్ లో హై అలర్ట్ లో ఉన్నాయి. అయితే సిప్రీ నివేదిక ప్రకారం ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా అణ్వాయుధాల సంఖ్య క్రమంగా తగ్గుతున్నట్లు తేలింది. అమెరికా, రష్యా లాంటి దేశాలు రిటైర్ అయిన ఆయుధాలను ఎలిమినేట్ చేస్తున్నాయి. అయితే ఎన్ని ఆయుధాలను ధ్వంసం చేస్తున్నారో మళ్లీ అంతే సంఖ్యలో ఆయుధాలను రీ ప్లేస్ చేస్తున్నట్లు నివేదిక పేర్కొంది.

# పోలీసులు నిర్వహించిన ఓపెన్ హౌస్ ను ప్రారంభించిన ఎస్పీ



**అనకాపల్లి, పెన్ సత్తా, నవంబర్ 03**: పోలీసు అమరవీరులు విధి నిర్వహణలో చూపిన త్యాగాలకు నివాళులర్పిస్తూ, అనకాపల్లి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంలో భాగంగా, సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయం ఆవరణలో ఓపెన్ హౌస్ కార్యక్రమంను జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు సమాజ రక్షణలో, శాంతి భద్రతల పరి రక్షణలో తమ ప్రాణాలను ధారపోసిన మహానుభావులు. వారి త్యాగాలను స్మరించుకుంటూ, విద్యార్థులకు పోలీసులు విధులు నిర్వర్తించే సమయంలో ఉపయోగించే అత్యాధునిక ఆయుధాలు, పరికరాల గురించి అవగాహన కల్పించడం ఎంతో ముఖ్యం అని పేర్కొన్నారు. పోలీసు శాఖ పై ఆసక్తి కలిగిన విద్యార్థులకు ఈ కార్యక్రమం ద్వారా నైపుణ్యాలు, శిక్షణ, క్రమశిక్షణల ప్రాధాన్యత పై అవగాహన ఏర్పడుతుందన్నారు. పోలిసు శాఖ ప్రజల సేవకే అని యువత గుర్తించాలి. భవిష్యత్తులో పోలీసులు కావాలనుకునే ప్రతిభావంతులు ముందుకు రావాలి అని జిల్లా ఎస్పీ వివరించారు.

ఆయుధాలు పరికరాలు ఏకె-47, పిస్టల్ గ్లోక్-17, కార్బన్, ఇన్సాస్ రైఫిల్, మల్టీ గ్యాస్ గన్ లాంచర్, గ్రెనేడ్ తదితరాలు

భద్రతా పరికరాలు రైట్ గేర్ సెట్స్, బాంబ్ డిఫ్యూజల్ పరికరాలు, నైట్ విజన్, సెర్చ్ మెటల్ డిటెక్టర్లు

కమ్యూనికేషన్ పరికరాలైన శాటిలైట్ ఫోన్, స్కానర్, వి.హెచ్.ఎఫ్ సెట్స్, రోబో సూట్, డాగ్ స్క్వాడ్ కు చెందిన బన్నీ (మత్తు పదార్థ గుర్తింపు), రియో (ట్రాకింగ్), లక్కీ (మందు పాతర గుర్తింపు), ఫింగర్ ప్రింట్, క్లూస్ టీం నేరస్థల పరిశోధనలో సాక్ష్యధారల సేకరణ పద్ధతులు వివరించారు. విద్యార్థులు ఆసక్తిగా పరికరాలను పరిశీలించి, పోలీసు విభాగం పనితీరు పై ప్రశ్నలు అడిగి అవగాహన పొందారు. ఈ ఓపెన్ హౌస్ లో భాష్యం స్కూల్ విద్యార్థులు ప్రత్యేక ఉత్సాహంతో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవ ప్రసాద్, ఎల్.మోహన్ రావు, ఇన్స్పెక్టర్లు లక్ష్మణ మూర్తి, బాల సూర్యారావు, లక్ష్మి, రమేష్, గఫూర్, రామకృష్ణరావు, మన్మధరావు, అనకాపల్లి రూరల్ ఇన్స్పెక్టర్ అశోక్ కుమార్, ఫింగర్ ప్రింట్స్ ఇన్స్పెక్టర్ విజయ, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

## బాబా జయంతి ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం రానీవొద్దు




**పుట్టపర్తి, పెన్ సత్తా, నవంబర్ 03:** భగవాన్ శ్రీ సత్య సాయి బాబా 100 వ జయంతోత్సవాల సందర్భంగా పుట్టపర్తికి విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాటు చేయాలని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అధికారులకు సూచించారు. పుట్టపర్తి కలెక్టరేట్లో సోమవారం సత్యసాయిబాబా 100 వ జయంతి ఉత్సవాల పై కలెక్టర్ శ్యాంప్రసాద్ అధ్యక్షతన సత్యసాయి ట్రస్ట్ సభ్యులు, ప్రభుత్వ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడారు. పుట్టపర్తి మున్సిపాలిటీ అత్యంత సుందర పట్టణంగా తీర్చిదిద్దాలని అధికారులకు తెలిపారు. పుట్టపర్తికి విచ్చేసిన భక్తులకు త్రాగునీరు, వైద్య చికిత్స శిబిరాలు మరుగుదొడ్లు పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలని వెల్లడించారు. బుక్కపట్నం కొత్త చెరువు ఏనుములపల్లి చెరువుల వద్ద ఈతగాలతో భద్రత ఏర్పాట్లు చేయాలని సూచించారు. బెంగళూరు హైదరాబాద్ తిరుపతి చెన్నై తమిళనాడు అనంతపురం ధర్మవరం రైల్వే స్టేషన్ పుట్టపర్తి రైల్వే స్టేషన్ హిందూపురం మడకశిర కదిరి ప్రాంతాల నుంచి భక్తులే ఎక్కువగా వస్తారని వారికి ఆర్టీసీ బస్సుల అదనంగా ఏర్పాటు చేసి ప్రమాణ సౌకర్యం కల్పించాలని రవాణా శాఖ అధికారులను కోరారు. పుట్టపర్తి లో ట్రాఫిక్ సమస్య లేకుండా పోలీసు భద్రత ఏర్పాటు చేయాలని కోరారు. పుట్టపర్తికి విచ్చేసే విఐపి, వీఐపీ లకు మౌలిక వసతులు కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అందుకు తగినట్టుగా ముందస్తు ఏర్పాట్లు చేయాలని జిల్లా అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, సత్యసాయి ట్రస్ట్ సభ్యులు చలం, ట్రస్ట్ సభ్యులు, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, జేసి మంత్రి మౌర్య భరద్వారాజ్, వెలుగు పిడి నరసయ్య, ఆర్టీసీ ఆర్ఎం మధు సూదన్, ట్రాన్స్కో ఎస్ ఈ సంపత్, ఆర్డబ్ల్యూఎస్ పంచాయతీరాజ్, పిఆర్ ఎస్ ఈ, ఆర్ అండ్ బి అధికారులు, ఇరిగేషన్ అధికారులు, పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్ క్రాంతి కుమార్, పబ్లిక్ హెల్త్ ఇంజనీర్ నరసింహమూర్తి, సమాచార శాఖ జిల్లా అధికారి పురుషోత్తం, ఇతర శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రేపు చోడవరం లో మెగా జాబ్ మేళా




జాబ్ మేళా గోడ పత్రికను ఆవిష్కరించిన కలెక్టర్ విజయ క్రిష్ణన్.

**అనకాపల్లి, పెన్ సత్తా, నవంబర్ 03:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ కల్పనలో భాగంగా నవంబర్ 5 న బుధవారం ఉదయం 9 గంటలకు చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు సుమారు 17 కంపెనీలతో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ మేరకు కలెక్టర్ విజయ క్రిష్ణన్, జాయింట్ కలెక్టర్ ఎం జాహ్నవి సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మెగా జాబ్ మేళా గోడ పత్రికను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ మెగా జాబ్ మేళాకు సుమారుగా 17 బహుళ జాతీయ కంపెనీలు 1,500 వందల ఉద్యోగాల ఖాళిలతో హాజరావుతున్నారని, ఈ ఇంటర్వ్యూలకు పదవ తరగతి, ఐ టి ఐ, డిప్లొమా, డిగ్రీ, పి జి వరకు చదువుకొని 18 నుండి 35 సంవత్సరముల వయస్సు గల యువతీ, యువకులు ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చని కలెక్టర్ తెలిపారు. ఆసక్తి కలిగిని నిరుద్యోగ యువతీ, యువకులు తమ వివరములను naipunyam.ap.gov.in వెబ్ సైట్ నందు తప్పనిసరిగా నమోదు చేసుకొని, రిఫరెన్స్ నెంబర్ తో పాటుగా ఎక్కువ రెస్యూమేలు, ఆదార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు జెరాక్స్ లతో ఉదయం 9 గంటలకు జాబు మేళా జరుగు ప్రదేశానికి హాజరు కాగలరు. మరిన్ని వివరములకు 9494791935, 7981102224 ఫోన్ నంబర్లను సంప్రదించగలరని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి డాక్టర్ ఎన్. గోవిందరావు, ఇంచార్జి డి అర్యో ఎస్ సుబ్బలక్ష్మి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనుటకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలి కలెక్టరు

- సురక్షిత మంచినీటి పథకాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి.
- ప్లాస్టిక్ నిషేదం పై నెలరోజులు పత్యేక క్యాంపయిన్.
- ప్రతి ఒక్కరు చేతి సంచిని ఉపయోగించాలి.
- ఉపాధిహామీకూలీలకు కనీస వేతనం అందించాలి.
- జిల్లా,డివిజను,మండల స్థాయిలో ఉద్యోగులకు కార్తీకవనబోజనాలు నిర్వహణ.



**అనకాపల్లి, పెన్ సత్తా, నబంబరు 03:** ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనుటకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ మండల అభివృద్ధి అదికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో మండల అభివృద్ధి అదికారులతో నిర్వహించిన సమీక్షాసమావేశంలో డుమా, డిఆర్డిఎ, పంచాయతీరాజ్, గ్రామ పంచాయతీ శాఖలకు సంబంధించిన అంశాల పై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనుటకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని, అందుకు సంబంధించిన సమాచారం సేకరించి సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. తుఫాను ప్రభావిత ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలు, గ్రామాల వివరాలను సిద్ధంగా ఉంచు కోవాలని, జె.సి.బి. ల యజమానుల ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంచు కోవాలని తెలిపారు. అత్యవసరపరిస్థితులలో వారిని ముందుగానే అప్రమత్తంచేయాలని సూచించారు. కాలువలు ఆక్రమణలకు గురిఅగుట మూలంగా రోడ్లు, గ్రామాలు ముంపునకు గురగుతున్నాయని కావున ప్రతి గ్రామంలో వర్షంనీరు సక్రమంగా ప్రవహించేలే డ్రైయిన్లు క్లియర్ చేయాలని తెలిపారు. రోడ్డు పై నీరు నిలువలేకుండా డ్రెయిన్లు సిద్ధంచేయాలన్నారు. కాలువలు పూడికకు కారణమవుతున్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పూర్తిగా నిషేదించడం జరిగిందని, దానిని కఠినంగా అమలుచేయాలన్నారు. ప్రతి ఒక్కరు చేతిసంచులు, తిరిగి వాడుకొనే వస్తువులు వినియోగించాలని, ప్రకృతిని కలుషితం కాకుండా కాపాడి భావితరాలకు అందించాలన్నారు. 15 ఫైనాన్స్ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించు కోవాలని, త్రాగునీటి పథకాలకు అధిక ప్రాధాన్యత కల్పించాలని, ప్రస్తుతం గల అన్ని పథకాలు వినియోగం లోనికి తీసుకురావాలని తెలిపారు. జలజీవన్ మిషన్ పనులు పూర్తిచేసి ప్రతి ఇంటికి సురక్షిత మంచినీరు అందించాలన్నారు.

యువతలో క్రీడల పట్ల ఆశక్తిని పెంచుటకు, వారు చెడుమార్గం పట్ట కుండా నిరోదించుటకు, ఆరోగ్యకరమైన యువతను తయారు చేయుటకు ప్రతి మండలంలో మేజరు పంచాయతీలలో ఒక వాలీబాల్ కోర్టు నిర్మించుటకు 25 సెంట్లు, 15 సెంట్లు ప్రకారం స్థలాలను గుర్తించి వెంటనే పనులు మొదలు పెట్టాలని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులమద్య సఖ్యత పెంచేందుకు, సంబంధాలు మెరుగుపరచుటకు, మానసిక ఆరోగ్యం పెంపొందించేందుకు జిల్లా, డివిజను, మండల స్థాయిలో ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్తీక వన భోజనాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయి కార్యక్రమం 11 వ తేదీన నిర్వహించడం జరుగుతుందని, ఈ లోగా డివిజను, మండల స్థాయిలో వనబోజనాలు కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. మునిసిపాలిటీ, గ్రామాలలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కాలువలలో పూడిక లేకుండా చూడాలని, కాలువలలో చెత్తను వేసే వారి పై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి షాపులో చెత్తబుట్టను ఉంచాలని, చెత్తను పంచాయతీ వారికి అందించాలని తెలిపారు. ప్లాస్టిక్ గ్లాసులు,సీసాలు విచ్చలివిడిగా రోడ్డు పై పారవేసే మద్యం, తదితర దుకాణాల పై చర్యలు తీసుకోవాలని, మాటవినకపోతే దుకాణాలు మూసివేయించాలన్నారు. గ్రామాలలో సేకరించిన పొడి చెత్తను పునర్వినియోగానికి గాను మారివలసలోగల జిందాల్ కంపెనీకి తరలించాలని, చెత్తను తరలించని పంచాయతీలకు జరిమానా విధించాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. క్లాప్ మిత్రలకు ప్రతి నెల సక్రమంగా వేతనాల చెల్లించాలని తెలిపారు. చెత్త నుండి సంపదతయారీ కేంద్రాల కార్యకలాపాల పై సమగ్రనివేదిక అందించాలని జిల్లా కలెక్టరు సూచించారు. వర్మికంపోస్టు తయారీ, అమ్మకం వివరాలు అందించాలన్నారు. గ్రామాలలో చెత్తసేకరణను అధికారులు ప్రతి రోజు పర్యవేక్షణ చేయాలన్నారు. పారిశుధ్యంలో ఐవిఆర్ఎస్ ద్వారా సేకరించిన ప్రజాభిప్రాయంలో వ్యతిరేక అభిప్రాయం వ్యక్తపరచిన సిబ్బందికి షోకాజు నోటీసులు జారీచేయాలన్నారు. రెండువారాలలో మరల అల్పపీడనం ఏర్పడే అవకాశమున్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు.

డి.ఆర్.డి.ఎ.కు సంబంధించి జిల్లాలో 97 శాతం పెన్షన్లు పంపిణీ చేయడం జరిగిందని, మిగిలిన వారికి పెన్షను పంపిణీచేయక పోవడానికి గల కారణాలను తెలియజేయాలన్నారు. బ్యాంకులింకేజీ, స్త్రీ నిధి నిధులు లక్ష్యం మేరకు పంపిణీ చేయలన్నారు. గ్రామ వార్డు సచివాలయాలకు సంబంధించి సచివాలయంలో అందించ వలసిన సేవలన్నింటిని ప్రజలకు అందించాలన్నారు. పించన్లు కొరకు కూడా కలెక్టరు కార్యాలయంనకు వచ్చి ధరఖాస్తులు అందిస్తున్నారని, గ్రామ స్థాయి సమస్యలను సచివాలయంలోనే పరిష్కరించడం ద్వారా ప్రజల కష్టాలను తగ్గించాలని తెలిపారు. ప్రజల పట్ల సిబ్బంది మర్యాదగా మసలుకోవాలని తెలిపారు. ఉపాధిహామీ కూలీల జాబ్ కార్డులను నూరు శాతం ఇ కెవైసీ పూర్తిచేయాలని జిల్లా కలెక్టరు తెలిపారు. ఆమోదించిన 38 మేజిక్ డ్రెయిన్లు వెంటనే పూర్తిచేయాలని తెలిపారు. నూరు రోజుల పనిదినాలు, 90 రోజులు ఇంటినిర్మాణ పనిదినాలు, కనీస వేతనం, ఇంకుడు గుంతలు, ఫార్మ్ పాండ్స్, మొక్కలు పెంపకం, కంపోస్టు పిట్స్ తదితర పనులు ఆమోదించిన మేరకు వెంటనే పనులు పూర్తిచేయాలని జిల్లా కలెక్టరు అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ సిఇఒ కె. రాజ్ కుమార్, డుమా పిడి పూర్ణమాదేవి, గ్రామవార్డు సచివాలయాల అదికారి మంజులవాణి, ఇఒపిఆర్డి నాగలక్ష్మి, డిపిఒ సందీప్, మండల అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

# తక్షణమే స్పందించిన పరవాడ పశువైద్య సిబ్బంది



**పరవాడ, పెన్ సత్తా, నవంబర్ 03:** ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని, ప్రజానీకాన్ని, పాడి రైతాంగాన్ని అతలాకుతలం చేసిన మొంథా తుఫాన్ గురించి అందరికీ తెలిసిన విషయమే. ఈ మొంథా తుఫాను ప్రభావితంతో పాడి రైతులు ఎక్కువగా ఇబ్బంది పడ్డారు. పాడి పశువులు తుఫాను ధాటికి వివిధ రకాల వ్యాధులతో బాధపడడం గుర్తించిన పరవాడ పశుసంవర్ధక శాఖ సబ్ డివిజనల్ అసిస్టెంట్ డైరక్టర్ డా.రామకృష్ణ కీర్తి తమ సిబ్బందితో సోమవారం నాడు పాయకరావు బోనంగిలో తుఫాను ప్రభావిత ఉచిత పశువైద్య శిబిరాన్ని, వాడ చీపురుపల్లి పశు వైద్యులు డా. సురేష్ కుమార్ సిబ్బందితో అత్యవసరంగా ఏర్పాటు చేసారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో తుఫాను కారణంగా అనారోగ్యానికి పాలై జ్వరం, గాయాలు బారినపడిన పాడి పశువులకు తగిన చికిత్స అందజేసారు. పెయ్యలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు పశువులకు బలాన్నిచ్చే లివర్ టానిక్కులు, మినరల్ మిక్చర్ పొట్లాలు, నట్టల నివారణ మందులు పాడి రైతులకు డా.రామకృష్ణ కీర్తి అందజేసారు. ఈ శిబిరంలో హాజరైన పాడి రైతులకు తమ పాడిని పెంపొందించడమై డా. రామకృష్ణ కీర్తి తగిన సూచనలు, జాగ్రత్తలు వివరించారు. ఈ అత్యవసర వైద్య శిబిరం ఏర్పాటు చేయడం పై పాయకరావు బోనంగి సర్పంచ్ బండారు కల్పన రాజశేఖర్, మాజీ ఎంపీటీసీ దెక్క శ్రీనివాసరావు గ్రామ రైతులు హర్షాన్ని తెలియజేస్తూ డా.రామకృష్ణ కీర్తి, డా.సురేష్ కుమార్ సిబ్బందిని అభినందించారు. ఈ ఉచిత పశువైద్య శిబిరంలో కలపాక, తానం, భరణికం, పెదముషిడివాడ రైతు సేవా కేంద్రాలలో పని చేస్తున్న పశువైద్య సహాయకులు భాస్కర్, లక్ష్మణ్, శ్రీనివాస్, గోపాల మిత్ర చిరంజీవి, పరవాడ మండల పశువైద్య సిబ్బంది పాల్గొని పశువులకు తగిన మెరుగైన వైద్యం అందజేసారు.

# పారిశుద్ధ్య కార్మికులకు వస్త్ర దానం

**ఎనికేపాడు (విజయవాడ రూరల్): పెన్ సత్తా, నవంబర్ 03:** ఎనికేపాడు గ్రామ పంచాయతీ తెలుగుదేశం 12 వ వార్డ్ మెంబర్ పొదిలి శ్రీను బాబు జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం నాడు పారిశుద్ధ్య కార్మికులందరికీ నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. సమాజ సేవలో నిరంతరం శ్రమిస్తున్న కార్మికులకు గౌరవ సూచకంగా ఆయన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ?శ్రీను బాబు చేసిన ఈ సేవా కార్యక్రమాన్ని గ్రామ పెద్దలు, నాయకులు అభినందించారు. ఈ సందర్భంగా ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా గ్రామ ప్రెసిడెంట్ రాచమల్ల పూర్ణ, కోనేరు పెదబాబు, కోనేరు చినబాబు, నారాయణరావు, జనసేన విజయవాడ రూరల్ మండల అధ్యక్షులు పొదిలి దుర్గారావు, ఎంపీటీసీ గంగుల శ్రీను, వార్డు నెంబర్లు జైపాల్, జిల్లా మహిళా అధ్యక్షురాలు పొదిలి లలిత, ఎనికేపాడు పంచాయతీ సెక్రటరీ విద్యాధర్, సచివాలయం సిబ్బంది, అంగన్వాడీ, డోక్రా సభ్యులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

?శ్రీను బాబు మరిన్ని మంచి కార్యక్రమాలు చేస్తూ ముందుకు సాగాలని పలువురు ఆకాంక్షించారు.



# రోడ్డు పక్కన చెత్త దుర్వాసనతో ప్రజల అవస్థ



పెద్దవుటపల్లి వద్ద రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త.





**పెద్దవుటపల్లి, పెన్ సత్తా, నవంబర్ 03:** గన్నవరం మండలం పరిధి లోని పెద్దవుటపల్లి నుంచి తెంపెల్లి రైల్వే స్టేషన్ కి వెళ్లే మార్గంలో పేరుకు పోయిన చెత్త ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. ఊరి లోని వ్యర్థాలన్నింటినీ తీసుకొచ్చి రోడ్డు పక్కనే వేయడం వల్ల కుళ్లిపోయిన కూరగాయలు, పండ్లు, ఇతర వ్యర్థాల నుంచి వస్తున్న భయంకరమైన దుర్వాసనతో ఆ మార్గంలో ప్రయాణించే స్థానికులు, రైల్వే ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. స్థానికంగా నివసించే ప్రజలు తమ గోడును వెళ్లబోసుకుంటూ, ఈ చెత్త కుప్పల వల్ల శ్వాస తీసుకోవడం కూడా కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో దుర్వాసన మరింత ఎక్కువగా ఉంటుందని, దీనివల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని భయపడుతున్నారు. పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం, స్థానిక ప్రజలు తెలిపిన వివరాల ప్రకారం, ఈ సమస్య గురించి పెద్దవుటపల్లి గ్రామ పంచాయతీ సిబ్బందికి పలుమార్లు విన్నవించినప్పటికీ వారు పట్టించు కోవడం లేదని తెలుస్తోంది. అంతే కాకుండా, పంచాయతీ సిబ్బందే ఊర్లోని చెత్త అంతా తీసుకొచ్చి ఈ రోడ్డు వద్ద వేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ నిర్లక్ష్యం కారణంగానే రోడ్డు పక్కన భారీ స్థాయిలో చెత్త కుప్పలు పేరుకుపోయాయని వారు వాపోతున్నారు. స్థానిక ప్రజల డిమాండ్ చెత్త నుంచి వస్తున్న ఈ భయంకరమైన వాసనతో మా జీవితాలు దుర్భరంగా మారాయి. ఇది కేవలం పర్యావరణ సమస్యే కాదు, ప్రజారోగ్య సమస్య కూడా. దయచేసి రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికారులు వెంటనే దృష్టి సారించి, ఈ చెత్తను ఇక్కడి నుంచి తొలగించి, గ్రామంలో శాశ్వత చెత్త డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి అని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, ప్రజల ఇబ్బందులను తొలగించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు తగు చర్యలు తీసుకోవాలని పెద్దవుటపల్లి గ్రామస్తులు కోరుతున్నారు.

# నక్కపల్లిలో హోంమంత్రి ప్రజా దర్బార్ కు విశేష స్పందన







నియోజకవర్గ ప్రజల నుండి వినతుల వెల్లువ

**నక్కపల్లి, పెన్ సత్తా నవంబర్ 03 :** మండల కేంద్రం నక్కపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత సోమవారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది.
ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా హోంమంత్రి వంగలపూడి అనిత నక్కపల్లి ఎంపీడీఓ కార్యాలయం వేదికగా ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గం లో ఉన్న నాలుగు మండలాల నుండి అధిక సంఖ్యలో వచ్చిన పిర్యాదులు,
అర్జీలను ప్రజలు నేరుగా హోం మంత్రి అనితను స్వయ్యంగా కలిసి అర్జీలు అందజేశారు. లబ్ధిదారులు ప్రతి ఒక్కరినీ పలకరిస్తూ, వారి సమస్యలను, వినతులు స్వీకరించారు. ఈ గ్రీవెన్స్ కార్యక్రమానికి వచ్చే వారినుండి పిర్యాదులు అర్జీలు స్వీకరించేందుకు అధికారులు, కూటమి నాయకులు శాఖలవారీగా టేబుల్స్ ఏర్పాటు చేసారు. ఈ ప్రజా దర్బార్ లో ఎక్కువగా భూ సమస్యలు, ఫించన్లు, రేషన్ కార్డులు, ఇంటి స్థలాలు హౌసింగ్ మత్స్యశాఖ విభాగాల్లో అధికంగా ఫిర్యాదులు వచ్చాయి.పరిష్కారానికి అవకాశం ఉన్న కొన్ని పిర్యాదులు, సమస్య లను సంబంధిత అధికారులతో హోం మంత్రి చర్చించి అక్కడికక్కడే పరిష్కరించార. అక్కడ పరిస్కారం కాని మరికొన్ని సమస్యలను ఆయా శాఖల అధికారులు విచారణ చేసి పరిష్కాలంచాలని అధికారులను ఆదేశించారు. ఇక్కడకు వచ్చిన ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా టీడీపీ నాయకులు అధికారులు అన్ని ఏర్పాట్లు చేసారు. నక్కపల్లి సి ఐ మురళి ఆధ్వర్యంలో ఎస్ ఐ సన్నిబాబు పోలీసులు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమం లో మండల శాఖ అధికారులు ఎంపీడీఓ సీతారామరాజు, తహసీల్దార్ నరసింహామూర్తి, ప్రతేకాధికారి విజయ డిప్యూటీ ఎంపీడీఓ చలపతిరావు, విద్య, వైద్య వ్యవసాయాధికారులు విద్యుత్ శాఖ అధికారులు స్థానిక టీడీపీ నాయకులు వెంకటేష్ తో పాటు నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

# సాంబమూర్తి శూలాల మహోత్సవానికి పటిష్ట బందోబస్తు ఎస్పీ



**మునగపాక, పెన్ సత్తా, నవంబర్ 03:** మునగపాక మండలం లోని శాంబ మూర్తి స్వామివారి శూలాల మహోత్సవం ప్రశాంతంగా, భక్తి పరవశంలో జరిగేలా పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ వి.విష్ణు స్వరూప్, యలమంచి సర్కిల్ ఇన్స్పెక్టర్ ధనుంజయ రావు, మునగపాక ఎస్సై ప్రసాదరావు, సిబ్బంది సమన్వయంతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. ఈ సందర్భంగా సాంబ మూర్తి స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎస్పీ, ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి ఏర్పాట్లను సమీక్షించారు. వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా భద్రతా చర్యలను విస్తృతంగా చేపట్టారు. శూలాల ప్రదర్శన సందర్భంగా పలు ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివస్తారు కాబట్టి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు అని ఎస్పీ తెలిపారు. పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, భక్తులు సహకరించాలని కోరారు.

# విద్యుత్ రంగం రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుంది.



ఎమ్మెల్యే%ఆ%పియుసి చైర్మన్ కూన రవి కుమార్.



**అమరావతి, పెన్ సత్తా, నవంబర్ 03:** రాష్ట్ర రాజధాని అమరావతి లోని విద్యుత్ సౌధా భవనంలో ఏపీ ట్రాన్స్కో విభాగం వార్షిక నివేదిక పై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆముదాలవలస నియోజకవర్గ శాసనసభ్యులు, రాష్ట్ర పియుసి చైర్మన్ కూన రవికుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యుత్ పంపిణీ, ఉత్పత్తి, ప్రసార రంగాల్లో మరింత సామర్థ్యంతో పనిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సరఫరా ఆదాయ వ్యయాల సమతుల్యత పై దృష్టి సారించాలని సూచించారు. ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. సమీక్షలో ట్రాన్స్కో ఉన్నతాధికారులు, పియుసి కమిటీ సభ్యులు, ఆర్థిక విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశంలో వివిధ ప్రాజెక్టుల పురోగతి, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల పనితీరు, నిర్వహణ వ్యయాలు, ఆదాయ వృద్ధి వ్యూహాల పై చర్చించబడింది. కూన రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిలో విద్యుత్ శాఖ కీలక పాత్ర పోషిస్తోంది. అందువల్ల పారదర్శకత, బాధ్యతాయుతం, సమర్థతతో పని చేయాలి అని తెలిపారు.

# పిజిఆర్ఎస్ లో అందిన అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యం..

- అర్జీల పరిష్కారంలో అర్జీదారుని సంతృప్తే ధ్యేయం.
- పిజిఆర్ఎస్ లో 154 అర్జీల రాక జిల్లా కలెక్టరు కృతికా శుక్లా





**చిలకలూరి పేట, పెన్ సత్తా, నవంబర్ 03:** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)వేదికలో అందిన అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు.
సోమవారం స్థానిక కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) ద్వారా జిల్లా నలుమూలలు నుండి వచ్చిన అర్జీదారులు నుండి అర్జీలను జిల్లా కలెక్టరు కృతికా శుక్లా స్వీకరించారు. జిల్లా కలెక్టరుతో పాటు
జాయింట్ కలెక్టర్ సూరజ్, జిల్లా రెవెన్యూ అధికారి అర్జీలను స్వీకరించారు. సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్ లో 154 అర్జీలు అందాయని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో ఎటువంటి
జాప్యానికి తావులేకుండా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. అర్జీదారుని సంతృప్తే ధ్యేయంగా అర్జీల పరిష్కారతీరు వుండాలని స్పష్టం చేశారు. అర్జీలు రీ-ఓపెన్ కాకుండా పరిష్కార చర్యలు ఉండాలన్నారు. ఫిర్యాదు దారులతో ముఖాముఖీగా మాట్లాడి ఫిర్యాదు దారుల సమస్యలను తెలుసుకుని పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. జిల్లా అధికారులు వారి శాఖలకు సంబంధించిన అర్జీలను క్షుణంగా పరిశీలించి తమ సిబ్బందితో నిర్ణీత గడువు లోగా త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలు తమ పరిధిలోనివి కానప్పుడు వెంటనే సంబందిత శాఖకు పరిష్కారం కోసం పంపాలని అధికారులకు కలెక్టరు సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# స్వర్ణాంధ్ర విజన్ 2047 యాక్షన్ ప్లాన్ పి4 కేంద్రాన్ని ప్రారంబించిన హెూం మంత్రి అనిత





**నక్కపల్లి, పెన్ సత్తా, నవంబర్ 03 :** స్వర్ణాంధ్ర విజన్ 2047 పాయకరావుపేట నియోజకవర్గం పి4 యాక్షన్ ప్లాన్ కేంద్రాన్ని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత సోమవారం ప్రారంభించారు. నక్కపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పి 4 కార్యాలయంలో ఆమె కొంతసేపు కూర్చుని నాయకులు, అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో పేదల పక్షపాతి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేద ప్రజలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు స్వర్ణాంధ్ర విజన్ 2047 పి4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో ఉన్న పేదలను గుర్తించి వారిని సంపన్నులుగా ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ పథకం సక్రమంగా అమలు చేసేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు శక్తివంచన లేకుండా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొప్పిశెట్టి వెంకటేష్, గింజాల లక్ష్మణరావు, దేవర సత్యనారాయణ, కురందాసు నూకరాజు, మరియు నాలుగు మండలాల టిడిపి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఆంధ్రా మెడికల్ కాలేజీలో ఫ్రెషర్స్ డే వేడుకలకు హాజరైన వంశీ కృష్ణ




**విశాఖపట్నం, పెన్ సత్తా, నవంబర్ 03:** ఆంధ్రా మెడికల్ కాలేజీలో ఆహ్వాన్ 2025 ఫ్రెషర్స్ డే వేడుకలకు హాజరైన దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, కలెక్టర్ శ్రీ హరేంద్ర ప్రసాద్. కేజీహెచ్, ఆంధ్రా మెడికల్ కాలేజీ లో కాబ్ ఆడిటోరియం లో ఆహ్వాన్ 2025 ఫ్రెషర్స్ డే వేడుకలకు దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ హరేందర్ ప్రసాద్ ముఖ్య అతిథులు గా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ ఫ్రెషర్స్ డే ద్వారా స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందని అన్నారు. కొత్త విద్యార్థులలో క్రమశిక్షణ, విలువలు, సృజనాత్మక, ఆవిష్కరణ లతో ముందుకు సాగాలని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం విద్యకు, ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి లోకేష్, మంత్రి సత్య కుమార్, ప్రభుత్వ యంత్రాంగం ప్రజా ఆరోగ్య ప్రమాణాలు పెంచడానికి ఎంతో కృషి చేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ప్రిన్సిపల్ సంధ్యాదేవి, సూపరింటెంట్ వాణి, వైద్య విభాగం పెద్దలు మన్మధరావు, కృష్ణవేణి, శ్యామల, వాసవి లత, శ్రీహరి, కూటమి నేతలు జగదీష్, సతీష్ పొన్నం, జగన్, రాజశేఖర్, స్థానిక జనసేన వార్డు అధ్యక్షురాలు యజ్ఞశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉమాకాశీ విశ్వేశ్వర లక్ష్మీనారాయణ ఆలయానికి సందర్శించిన సిపి



**విశాఖపట్నం, పెన్ సత్తా, నవంబర్ 03:** విశాఖ నగరం 46 వ వార్డు పరిధి కైలాసపురం జంక్షన్ లో ఉన్నటు వంటి ఉమాకాశీ విశ్వేశ్వర లక్ష్మీనారాయణ ఆలయంలో గత పది సంవత్సరాల నుండి ఆలయ ధర్మకర్త లాలం దేవుడు కుమారులు, లాలం అర్జున్, ప్రతి ఏడాది 41 రోజుల స్వామీలకు అన్నప్రసాదం కార్యక్రమం నిర్వహిస్తారు. కమిటీ ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పాల్గొని అర్చకులతో ప్రత్యేక పూజలు చేసి, స్వామిలకు తమ చేతుల మీదుగా అన్న ప్రసాదం వడ్డించారు. అనంతరం సిపి మాట్లాడుతూ, శివుడు, లక్ష్మి నారాయణలు, సుబ్రహ్మణ్యం స్వామి ఆశీస్సులు ప్రజలకు ఏప్పుడు అండగా, నిండుగా ఉండాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ, ప్రజలందరూ సుఖసంతోషాలతో దేవుడు ఆశీస్సులు వర్ధిల్లాలి కోరారు. ఆ శివుడు అందరికీ చల్లగా చూడాలని, ఆ దేవుడు యొక్క ఆశీస్సులు సమాజానికి, ఐకమత్యం శక్తి స్ఫూర్తి ఇచ్చే విధంగా ఉండాలని కోరారు. అలానే విశాఖ నగరం నిరంతరం శాంతి, భద్రతలను పరి రక్షణకు కృషి చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ పోలీస్ శాఖ ఎప్పుడు ప్రజలపక్షాన నిలబడుతుందన్నారు. ప్రజలతో మమేకమవుతు, క్షణాల్లో స్పందిస్తూ సమస్య పరిష్కార దిశగా నగరాన్ని మార్చే దిశగా కృషి చేస్తానని తెలిపారు. ఎలాంటి సమస్యలు వచ్చినా నేరుగా సిపి ని సంప్రదించే విధంగా అందుబాటులో ఉంటానని, నగరవాసులు కూడా పోలీస్ శాఖ తోడుగా, నీడగా ఉండాలని కోరారు. అలానే అక్కడ ఉన్న స్థానికులు విశాఖ నగర పోలీస్ కమిషనర్ రామాలయానికి రావడంతో,ప్రజల మాటల్లో ఎంతో ఆనందదాయకంగా కనిపించింది, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పై ప్రజలు ప్రశంసలు కురిపించారు, ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయం ధర్మకర్త లాలం దేవుడు కుమారులు, అర్జున్, సత్యనారాయణ, స్వామీలు భక్తులు పాల్గొన్నారు.

# దామాషా పద్ధతిలో బీసీ కార్పొరేషన్లకు నిధులు

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత.
- బీసీ రక్షణ చట్టం రూపకల్పనకు ప్రణాళికలు.
- త్వరలోనే కుట్టుమిషన్ల పంపిణీ.
- ఆదరణ 3.0తో కుల, చేతివృత్తుల వారికి శాశ్వత ఉపాధి.
- కార్పొరేషన్ చైర్మన్లకు అన్ని విధాలా ప్రాధాన్యం మంత్రి సవిత
- భువనమ్మకు మంత్రి సవిత అభినందనలు.




**విజయవాడ, పెన్ సత్తా, నవంబర్ 03:** జనాభా దామాషా పద్ధతిలో ఆయా కార్పొరేషన్లకు నిధులు కేటాయించ నున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టం చేశారు. బీసీ రక్షణ చట్టం రూపకల్పనకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, ఇదే విషయమై ఇప్పటికే బీసీ మంత్రులతో సమావేశాలు సైతం నిర్వహించామన్నారు. త్వరలోనే కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు కుట్టు మిషన్లు అందజేయనున్నామని వెల్లడించారు. విజయవాడ లోని గొల్లపూడి బీసీ భవన్ లో సోమవారం 10 వివిధ బీసీ కులాల కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లతో మంత్రి సవిత ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కులాల చేతివృత్తుల అభివృద్ధికి ఏవిధమైన ఆధునిక పరికరాలు అందజేయాలన్న అంశం పై వారి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ, బీసీలను అన్ని రంగాల్లోనూ ముందంజలో నిలపాలన్న సంకల్పంతో టీడీపీ ఆవిర్భవించిందన్నారు. ఆనాడు అన్న ఎన్టీఆర్ బీసీల అభ్యున్నతికి ఎన్నో సంస్కరణలు తీసుకురాగా, ఆయన స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు వెనుబడిన తరగతులకు అండగా నిలుస్తున్నారన్నారు. ఆదరణ పథకాన్ని తీసుకొచ్చి కుల, చేతివృత్తి దారులకు సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చారన్నారు. 2014-19 మధ్య కాలంలో బీసీల సర్వతోముఖాభివృద్ధికి సీఎం చంద్రబాబు నాయుడు ఎంతో పథకాలు అమలు చేశారన్నారు. అనంతరం వచ్చిన జగన్ బీసీల ద్రోహిగా మిగిలారన్నారు. బీసీలను అన్ని విధాలా అణగదొక్కారన్నారు. 2019-24 మధ్య వెనుకబడిన తరగతులు అన్ని విధాలా తీవ్రంగా నష్టపోయావన్నారు. కుల వృత్తులకు ఆధునిక పరికరాలు. 2024 ఎన్నికల్లో సీఎం చంద్రబాబు విజయం సాధించడంతో బీసీలకు మరోసారి మంచి రోజులు వచ్చాయన్నారు. బీసీలకు ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని సీఎం చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్నారన్నారు. చట్ట సభల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్ల కల్పించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి అమలు కోసం కేంద్రానికి పంపామన్నారు. బీసీల రక్షణ చట్టం ఏర్పాటుకు ఇప్పటికే చర్యలు ప్రారంభించామన్నారు. బీసీ మంత్రులతో రెండు పర్యాయాలు సమావేశాలు సైతం నిర్వహించామన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రూ.1000 కోట్లతో ఆదరణ 3.0 పథకానికి శ్రీకారం చుట్టామన్నారు. ప్రస్తుత అభిరుచులకు అనుగుణంగా కుల, చేతివృత్తి దారులకు ఆదరణ 3.0 పథకం కింద ఆధునిక పరికరాలు అందజేయనున్నట్లు తెలిపారు. కుల, చేతివృత్తిదారులకు శాశ్వత ఉపాధే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. బీసీ బిడ్డల విద్యకు ప్రాధాన్యం. అధికారం లోకి వచ్చిన నాటి నుంచి బీసీ బిడ్డల విద్యకు సీఎం చంద్రబాబు అధిక ప్రాధాన్యమిస్తున్నారని మంత్రి సవిత వెల్లడించారు. గత ప్రభుత్వం పెట్టిన డైట్, కాస్మోటిక్ ఛార్జీల బకాయిలను అధికారం లోకి రాగానే చెల్లించామన్నారు. హాస్టళ్ల మరమ్మతులకు రూ.20 కోట్లు మంజూరు చేశామని, ఇటీవల మరో రూ.60 కోట్లు అందజేశామని తెలిపారు. అన్ని హాస్టళ్లు, గురుకులాల్లో సీసీ కెమెరాలు, ఆర్వో ప్లాంట్లు, ఇన్వర్టర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా డీఎస్సీ, సివిల్ సర్వీసెస్ కోచింగ్ అందజేశామన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా అందజేసిన కోచింగ్ ఎందరో బీసీ అభ్యర్థులు ఉపాధ్యాయులుగా నియమితులయ్యారన్నారు.

బీసీ పాలక మండళ్లకు విధులు, నిధులు. బీసీ పాలక మండళ్లను ఉత్సవ విగ్రహాల మాదిరిగా చూడకుండా వాటికి విధులు, నిధులు ఇవ్వాలని నిర్ణయించినట్లు మంత్రి సవిత వెల్లడించారు. దామాషా పద్ధతిలో ఆయా కార్పొరేషన్లకు నిధులు కేటాయించినున్నట్లు తెలిపారు. బీసీ కార్పొరేషన్ల చైర్మన్లకు సీఎం చంద్రబాబు త్వరలోనే తీపికబురు అందిస్తారని మంత్రి తెలిపారు. భువనమ్మకు మంత్రి సవిత అభినందనలు. లండన్ లో ప్రతిష్టాత్మకమైన రెండు అవార్డులను నేడు మంగళవారం అందుకోనున్న నారా భువనేశ్వరికి మంత్రి సవిత అభినందనలు తెలియజేశారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా చేస్తున్న సామాజిక సేవలను గుర్తిస్తూ లండన్ లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్(ఐవోడీ) సంస్థ నారా భువనేశ్వరికి డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ 2025 అవార్డు ప్రకటించడం హర్షణీయమన్నారు. అదే వేదిక పై ఎక్స్ లెన్స్ ఇన్ కార్పొరేట్ గవర్నెన్స్ విభాగంలో హెరిటేజ్ ఫుడ్ కు లభించిన గోల్డెన్ పీకాక్ అవార్డును కూడా ఎండీ హోదాలో భువనేశ్వరి అందుకోనున్నారన్నారు. ప్రపంచ కప్ గెలుచుకున్న మహిళా టీ మిండియా జట్టుకు మంత్రి సవిత అభినందనలు తెలియజేశారు. అనంతరం మంత్రి సవితను కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, ఆయా కార్పొరేషన్ల చైర్మన్లు కుడిపూడి సత్తిబాబు, రోణంకి కృష్ణం నాయుడు, దేవంద్రప్ప, నందం అబద్ధయ్య, మరుపిల్ల తిరుమలేశ్వర రావు, మళ్ల సురేంద్ర, సీఆర్ రాజన్, పేరేపి ఈశ్వర్, వీరంకి వెంకట గురుమూర్తి, సీహెచ్.సావిత్రి, రెడ్డి అనంతకుమారి, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, బీసీ సంక్షేమ శాఖాధికారులు పాల్గొన్నారు.

# పలు అభివృద్ధి పనులకు మేయర్, పంచకర్ల శంకుస్థాపన





**విశాఖపట్నం, పెన్ సత్తా, నవంబర్ 03:** విశాఖ నగర అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం లోని కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన జీవీఎంసీ 8 వ జోన్ (పెందుర్తి జోన్) లోని 93 వ వార్డులో పలు ప్రాంతాలలో జీవీఎంసీ నిధుల వెచ్చించి సుమారు. రూ. 232.66 లక్షల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు, వార్డ్ కార్పొరేటర్ రాపర్తి కన్నా లతో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం లోని కూటమి ప్రభుత్వానికే సాధ్యమని పేర్కొన్నారు. విశాఖను ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేయడం ద్వారా ఉత్తరాంధ్రతో పాటు ఎంతో మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. అలాగే జీవీఎంసీ నిధులతో పెందుర్తి జోన్ లోని 93 వార్డు లోని సాయి మాధవ్ నగర్ లో వినాయకుని ఆలయం ఎదురుగా కమ్యూనిటీ హాల్ నిర్మాణం కొరకు అంచనా విలువ. రూ.20. లక్షలు, సాయి మాధవ్ నగర్లో సిసి రోడ్లు నిర్మాణంకు అంచనా విలువ.19.63 లక్షలు, కృష్ణానగర్ లో హోమియోపతి ఆసుపత్రి వద్ద సుమారు రూ. 31.50 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవం, బాలాజీ గార్డెన్స్ లో సుమారు రూ . 19.87 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లు ప్రారంభోత్సవం, ప్రహ్లాదపురంలో సిసి రోడ్ నిర్మాణానికి సుమారు రూ.18.50 లక్షలు, ప్రహ్లాదపురంలో శివాలయం వెనుక సుమారు రూ. 35.20 లక్షల వ్యయంతో నిర్మించిన 6 సీసీ రోడ్లు కు ప్రారంభోత్సవాలు, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సుమారు రూ.19.98 లక్షలు, వెంకటాద్రి నగర్ లో సుమారు రూ. 34 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్ల ప్రారంభోత్సవం, పోస్టల్ కాలనీలో సుమారు రూ . 18.43 లక్షల నిర్మించిన సిసి రోడ్లు ప్రారంభోత్సవం, శ్రీనివాస్ నగర్ లో సుమారు రూ. 15.50 లక్షల వేయంతో నిర్మించిన సిసి రోడ్లు ప్రారంభించామని మేయర్ తెలిపారు. అనంతరం పెందుర్తి శాసనసభ్యులు మాట్లాడుతూ పెందుర్తి నియోజవర్గం ప్రాంతంలో అభివృద్దే నా ప్రథమ కర్తవ్యం అని, రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి నాయకత్వంలో కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళని, పెందుర్తి నియోజకవర్గం లోని ఉన్న వార్డులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడం జరుగుతోందని పేర్కొన్నారు. అందులో భాగంగా సుమారు రూ. 2.33 కోట్లతో పెందుర్తి జోన్ లోని 93 వ వార్డులలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనతో పాటు ప్రారంభోత్సవాలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ హెచ్. శంకర్ రావు, జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు, కూటమి నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# రేబాకలో శివాలయ నిర్మాణాని కి శంఖు స్థాపన



**నక్కపల్లి, పెన్ సత్తా నవంబర్ 03** :మండలంలోని రేబాక గ్రామంలో సోమవారం నూతన శివాలయం నిర్మాణానికి శంఖుస్థాపన కార్యక్రమం వైభవంగా జరిగింది. విశ్వహిందూ పరిషత్ జిల్లా మాజీ అధ్యక్షులు గొట్టుముక్కల శ్రీహరి రాజు ఆధ్వర్యంలో ద్వాదశ జ్యోతిర్లింగాలు, పంచారామాలు, పంచభూత లింగాలు, అయ్యప్ప, గణపతి, కుమారస్వామి విగ్రహాలతో శివాలయాన్ని నిర్మించనున్నారు. అనకాపల్లికి చెందిన ప్రముఖ వేద పండితులు బంకుపల్లి సత్యనారాయణ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఎస్ రాయవరం మండలానికి చెందిన పండితులు ఇరుకు సోంబాబు, అరుణ దంపతులు ఈ పూజ కార్యక్రమం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ హరి రాజు మాట్లాడుతూ ఈ శివాలయం నిర్మాణం పూర్తయితే మెరక గ్రామాల భక్తులకు శివ దర్శిణం అందుబాటులో వుంటుందని శ్రీహరి రాజు చెప్పారు. ఈ ప్రాంతంలో గూడుపమ్మ అమ్మవారి ఆలయం వున్నందున, శివాలయం కూడా నిర్మిస్తే రేబాక గ్రామానికి మరింత గుర్తింపు ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో సాదిరెడ్డి వర ప్రసాద్, త్రిపురాల రాము, విజయ్, తాతాజీ, వరహాలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# జగన్ కు చేతకావట్లేదు.. పవన్ ప్రతిపక్ష నేత కావాలి ఉండవల్లి

**విజయవాడ, పెన్ సత్తా, నవంబర్ 03**: జగన్ తీరు పై ఆయన శ్రేయోభిలాషి ఉండవల్లి అరుణ్ కుమార్ విసిగిపోయారు. ఎంత మంచి చెప్పినా వినిపించుకోవడం లేదని, ఆయనకు బాగుపడే లక్షణాలు లేవని, ఆయన మంచి కోరుకునే పెద్దమనిషిలా బాధపడిపోతున్నారు. అందుకే ఆయన ప్రెస్ మీట్ పెట్టి పవన్ ప్రతిపక్ష పాత్ర పోషిస్తే ఏపీకి మంచి జరుగుతుందని చెప్పుకొచ్చారు. ప్రతిపక్ష హోదా ఇవ్వడం లేదని జగన్ అసెంబ్లీకి పోకపోవడం ఏమిటని ఉండవల్లి ఆశ్చర్యపోయారు. (ఆయన ఇప్పుడే కాదు, ఏడాదిన్నర నుంచి పోవడంలేదని ఉండవల్లికి తెలియదేమో కానీ) పదకొండు మంది ఎమ్మెల్యేలను తీసుకుని వచ్చే సమావేశాల్లో అయినా అసంబ్లీకి వెళ్లాలని సలహా ఇచ్చారు. ఆయన పోతాడని నమ్మకం లేకపోవడంతో పవన్ కల్యాణ్ ప్రతిపక్ష పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. అలా ప్రతిపక్ష పాత్ర పోషిస్తేనే ఏపీకి మంచి రోజులు వస్తాయన్నారు. కూటమిని విడదీస్తేనే తప్ప తనకు రాజకీయ భవిష్యత్ లేదనుకుంటున్న జగన్ రెడ్డి రాజకీయానికి ఉండవల్లి ఇలా సహకారం అందిస్తున్నారని అందరూ అనుకుంటారని, తన లాయర్ తెలివితేటలు చూపించి, కూటమి విడిపోవాలన్నది తన లక్ష్యం కాదని చెప్పుకొచ్చారు. రాష్ట్రానికి మంచి జరగడం అంటే ఏమిటో ఆయన చెప్పడం లేదు. జగన్ రెడ్డి ఐదు సంవత్సరాల పాటు రాష్ట్రాన్ని అత్యంత ఘోరంగా నాశనం చేస్తే, పునాదులు పెకిలిస్తే ఒక్క నాడు కూడా ఇది తప్పు అని చెప్పలేదు. మార్గదర్శి కోసం జగన్ రెడ్డి తో సుప్రీం కోర్టులో ప్రభుత్వం తరపున అప్పీల్ చేయించిన ఆయన, విభజన చట్టం పై మాత్రం కౌంటర్ దాఖలు చేయించలేదు. కానీ ఇప్పుడు మాత్రం ప్రభుత్వం కౌంటర్ చేయాలని అంటున్నారు. ఉండవల్లి లాయరే కానీ, అసలు పనికి మాలిన, పనికి రాని విషయాల పై ప్రభుత్వం పోరాటం చేయాలని అనుకోవడమే విచిత్రంగా ఉంది. దాన్నుంచి ఆయన రాజకీయం



కోరుకుంటున్నారు.

## రాష్ట్ర హోం మంత్రి అనిత కు అనకాపల్లి పుస్తక మహోత్సవానికి అహ్వానం



**నక్కపల్లి, పెన్ సత్తా, నవంబర్ 03 :**రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనితను అనకాపల్లి పుస్తక మహోత్సవం కార్యక్రమానికి ఆహ్వానం అందింది. సోమవారం నక్కపల్లి టీడీపీ పార్టీ క్యాంప్ కార్యాలయం లో విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి, గత నెల 30వ తేదీ నుండి నవంబర్ 7 వరకు అనకాపల్లి ఎన్టీఆర్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న అనకాపల్లి పుస్తక మహోత్సవానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షులు కె. లక్ష్మయ్య మాట్లాడుతూ, వి బి ఫ్ స్ గత 35 ఏళ్లుగా పుస్తకమహోత్సవాలను నిర్వహిస్తూ, పుస్తక పఠనా సంస్కృతిని అభివృద్ధి చేయడానికి కృషి చేస్తోందని వివరించారు. అలాగే ఉత్తరాంధ్రలో జరుగుతున్న మొదటి అనకాపల్లి పుస్తక మహోత్సవం గురించి ఆమెకు వివరించారు. మంత్రి అనిత దీనిపై సంతోషం వ్యక్తం చేసి, తనకు ఉపాధ్యాయురాలిగా ఉన్నప్పటి విద్యా అనుభవాలను వారితో పంచుకున్నారు. ఈ కార్యక్రమానికి తప్పకుండా సందర్శిస్తానని తెలిపారు.
విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఇలాంటి మంచి కార్యక్రమాన్ని అనకాపల్లిలో నిర్వహిస్తున్నందుకు ఆమె సంస్థ ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమం లో కొప్పిశెట్టి వెంకటేష్, టీడీపీ నాయకులు ఉపాధ్యాయులు ఉన్నారు.

## 4,5 తేదీల్లో సూర్యలంక, పాండురంగాపురం సముద్ర తీరాలకు అనుమతి లేదు

● ఆర్డీఒ పీ గ్లోరియా

**బాపట్ల, పెన్ సత్తా, నవంబర్ 3:-**బాపట్ల మండలం సూర్యలంక మరియు పాండురంగాపురం సముద్ర తీరాలలో ఈ నెల 4,5 తేదీల్లో భక్తులను ఎవరిని అనుమతించడం లేదని బాపట్ల ఆర్డీఓ పీ గ్లోరియా సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మొంథా తుఫాను వల్ల సముద్రంలో ఏర్పడిన చిన్న చిన్న గుంటల ప్రమాదకర స్థాయిలో ఉండి పర్యాటకులు మరియు భక్తులు నేలలో దిగబడి ప్రమాదములు జరిగే పరిస్థితులు ఉన్నందున 4,5 తేదీల వరకు భక్తులు మరియు పర్యాటకుల భద్రత దృష్ట్యా సూర్యలంక మరియు పాండురంగాపురం సముద్ర తీరాలకు తదుపరి పరిశీలన చేసి అనుమతి ప్రకటన ఇచ్చు వరకు మూసివేయడమైనదని ఆ ప్రకటనలో తెలియజేశారు.



# ప్రజలకు తప్పిన ఆధార్ తిప్పలు



**సోమందేపల్లి, పెన్ సత్తా, నవంబర్ 03:** సోమందేపల్లి లో ప్రారంభమైన ఆధార్ కేంద్రం.

ప్రజలకు ఏ పథకం కావాలన్నా, ఈ ఉద్యోగం రావాలన్నా, ఏ పనులు జరగాలన్న ఆధార్ కార్డ్ ఎంతో అవసరం, తమ ఆధార్ కార్డులలో తప్పులు సరి చేయించాలన్న, నూతన ఆధార్ చేయించాలన్న ప్రజల మీద పట్టణాలకు వెళ్లేవారు, ఇకమీదట వీరి బాధలు తొలగనున్నాయి, సత్య సాయి జిల్లా సోమందేపల్లి మండల కేంద్రం లోని మీసేవ కేంద్రంలో స్థానిక అంబేద్కర్ సర్కిల్లో సోమవారం ఆధార్ కార్డ్ సెంటర్ ను ప్రారంభించారు. నందకుమార్ రెడ్డి, గత నాలుగేళ్లుగా సోమందేపల్లి మండల ప్రజలకు చాలా సమస్యలు ఉన్నాయని, నేటి నుండి ప్రజలకు ఆ కష్టాలు తీరి, వారి ఆధార్లో మార్పు చేర్పులకు ఇది మంచి అవకాశం అన్నారు నందకుమార్ రెడ్డి, సోమందేపల్లి మండల ప్రజలందరూ అవకాశం ఉపయోగించు కోవాలని, ఈ ఆధార్ కార్డు సెంటర్ ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు నందు కుమార్ రెడ్డి. వివరాలకు 8639101610 సంప్రదించాలన్నారు.

# భక్తులకు ప్రసాదం పంపిణి

**అనకాపల్లి, పెన్ సత్తా, నవంబర్ 03**: విశాఖ ఫైనాన్స్ అసోసియేషన్ అనకాపల్లి ఆధ్వర్యంలో కార్తీక్ మాసం రెండవ సోమవారం సందర్భంగా కోటవీధిలో వెలిసిన బోగలింగేశ్వర సమేత సర్వకామంద అమ్మవారి దేవస్థానంలో భక్తులకు ప్రసాద ఆలయ చైర్మన్ కాంద్రేగుల సత్యనారాయణకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు బిఎస్ఎంకే జోగినాయుడు, చైర్మన్ కర్రీ సన్యాసనాయుడు, అధ్యక్షులు ఎస్ ఎస్ టి కోటేశ్వరరావు,కార్యదర్శి ఆళ్ల జగన్, కోశాధికారి కొణతాల సన్యాసినాయుడు, సభ్యులు పిఎస్ అప్పారావు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# కోటి సంతకాలు సేకరణ కార్యక్రంలో బూడి



**దేవరాపల్లి, పెన్ సత్తా, నవంబర్ 03:** దేవరాపల్లి గ్రామంలో రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సభ్యులు వరదపురెడ్డి లలితా నాయుడు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సభ్యుల ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన రెడ్డి ఆదేశాలు మేరకు రాష్టంలో ఉన్న కూటమి ప్రభుత్వం అన్యాయంగా 17 మెడికల్ కాలేజీలును ప్రైవేటుపరం చేసే కార్యక్రమంను అడ్డుకొనే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత్రుత్వంవంలో కోటి సంతకాలు సేకరణ చేపట్టారు. సోమవారం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యవహారాల సలహా సంఘం సభ్యులు బూడి ముత్యాల నాయుడు విచ్చేసి ప్రజలు అందరితో రచ్చబండ సమావేశమై, ప్రజలుకు కూటమి ప్రభుత్వ పరిపాలన వలన జరుగుతున్న ఇబ్బందులు, అన్యాయాలును వివరిస్తూ ప్రభుత్వ మెడికల్ కాలేజీలును ప్రైవేట్ పరం కాకుండా ప్రజలు మద్దత్తుతో అడ్డుకొనుటకు వారి సంతకాలు సేకరించి రాష్ట్ర గవర్నర్ కి సమర్పించుటకు సంతకాలు సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవరాపల్లి మండల పరిషత్ అధ్యక్షులు చింతల బుల్లి లక్ష్మి, గ దేవరాపల్లి మండల జడ్పీటీసీ కర్రి సత్యం, అనకాపల్లి జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆర్టిఐ విభాగం అధ్యక్షులు కోటాన వెంకటరమణ (ఎల్.ఐ.సి రమణ), అనకాపల్లి జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సభ్యులు వేచలపు శ్రీవాణి, మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బూరె బాబురావు, మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం అధ్యక్షులు గొర్రెపోటు రమాదేవి, మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా విభాగం అధ్యక్షులు గంగవంశం సంతోష్, మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## బల్క్ డ్రగ్ పార్క్ రద్దు ప్రకటన చేయాలి

● హోం మంత్రి అనితకు రాజయ్యపేట మత్స్యకారుల వినతి



**నక్కపల్లి, పెన్ సత్తా, నవంబర్ 03 :**
బల్క్ డ్రగ్స్ పార్క్ రద్దు ప్రకటన చేసి మత్స్యకారులను ఆదుకోవాలని నక్కపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు హోం మంత్రి తో మాట్లాడుతూ మత్స్యకారుల భవిషత్ ను దృష్టిలో ఉంచుకుని బల్క్ డ్రగ్ పార్క్ రద్దు చేయాలని కోరారు. ఈ లాంటి రసాయన పరిశ్రమలు రావడం వలన ప్రత్యక్షంగా పరోక్షంగా మత్స్యకారుల జీవితాలు నాశనం అవుతాయని ఆవేదన వ్యక్తం చేసారు. ఇప్పటికే సముద్ర సంపద మొత్తం నాశనమయి వేట సరిగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని హోం మంత్రి అనితకు తమ ఆవేదన వ్యక్తం చేసారు. మా యెక్క సమస్య లను పరిగణలోకి తీసుకుని బల్క్ డ్రగ్ పార్క్ రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు బాబ్జి, మహేష్, సోమేశ్, కాశి, సోమేష్,మాధవ, నరేష్, స్వామి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## బల్క్ డ్రగ్స్ రద్దు పోరాటానికి ఐద్వా మద్దతు



**నక్కపల్లి, పెన్ సత్తా, నవంబర్ 03 :**బల్క్ డ్రగ్స్ పార్క్ రద్దు చేయాలని మత్స్యకారులు చేస్తున్న 51వ రోజు శాంతియుత నిరాహార దీక్ష కు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య (ఐద్వా ) మద్దతు ప్రకటించారు. సోమవారం సమాఖ్య జిల్లా అధ్యక్ష , కార్యదర్శులు మాణిక్యం, వరలక్ష్మి జిల్లా కమిటీ సభ్యులు మంగ, లక్ష్మి తదితరులు పాల్గొని వాళ్లకి సంపూర్ణ మద్దతు తెలియజేసారు. దీక్షా శిభిరం లో కూర్చుని బల్క్ డ్రగ్స్ పార్క్ రద్దు చేయాలని నినాదాలు చేసారు. బల్క్ డ్రగ్స్ పరిశ్రమ రద్దు చేయాలని మత్స్యకారులు పస్తులతో ఆందోళన చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోలేదని వారికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమం లో స్థానిక మత్స్యకారులు పాల్గొన్నారు.

## కర్లపాలెం మండలం సత్యవతి పేట దగ్గర ఘోర రోడ్డు ప్రమాదం

● కారును ఢీ కొట్టిన కంటైనర్ లారీ, నలుగురు దుర్మరణం
● మృతులంతా ఎమ్మెల్యే నరేంద్ర వర్మ బంధువులు





**బాపట్ల, పెన్ సత్తా, నవంబర్ 3:-**
బాపట్ల జిల్లా బాపట్ల నియోజకవర్గం కర్లపాలెం మండలం సత్యవతి పేట దగ్గర ఆదివారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఘోర ప్రమాదం జరిగింది. ఆదివారం బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు కుమారుడి సంగీత్ కార్యక్రమానికి వెళ్లి తిరిగి వస్తుండగా వేగంగా వచ్చిన కంటైనర్ లారీ కారును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు బంధువులు నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ రోడ్డు ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న బేతళం బాలమరాజు ( 65 ),బేతళం లక్ష్మి ( 60 ),గాదిరాజు పుష్పవతి ( 60 ),మదుచారి శ్రీనివాసరాజు ( 54 ) అక్కడికక్కడే మృతి చెందారు. గాయపడిన ఇద్దరిలో ఒకరిని చీరాల ఐకాన్ హాస్పిటల్ కు, మరొకరిని గుంటూరు రమేష్ హాస్పిటల్ కు తరలించారు.

# కథానాయకి



ఒక జట్టు ప్రపంచకప్ గెలిచినంత మాత్రాన ఈ ఘనతనంతా తీసుకెళ్లి కెప్టెన్‌కు కట్టబెట్టేయలేం. కానీ హర్మన్‌ది ఈ విజయంలో అత్యంత కీలక పాత్ర. వన్డేల్లో పూర్తిస్థాయి కెప్టెన్‌గా ఆమె 3 ఏళ్లుగా జట్టును నడిపిస్తోంది. తన సారథ్యంలో జట్టు ఎంత మెరుగైందో ఏడాది ఆడిన సిరీస్‌లు, ప్రస్తుత ప్రపంచకప్ చూసిన వాళ్లకు బాగానే అర్థమై ఉంటుంది. ఒకప్పుడు భారత జట్టు ఆట ఎలా ఉండేదో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. 2005లో కేవలం 215 పరుగుల లక్ష్యం నిలిచినా.. 98 పరుగుల తేడాతో ఓడింది భారత్. 2017 సమయానికి ఆట మెరుగుపడ్డా.. అప్పుడు 229 పరుగుల లక్ష్యానికి చేరువగా వెళ్లి త్రుటిలో ఓడింది భారత్. కానీ ప్రస్తుత ప్రపంచకప్‌లో అత్యధిక స్కోరు ఘనత భారత్‌దే. ఆస్ట్రేలియా లాంటి మేటి జట్టుపై ఏకంగా 339 పరుగుల ఛేదనతో ప్రపంచ రికార్డు నెలకొల్పింది ఇండియా. భారత్ ఆటతీరు, దృక్పథం ఎంతగా మారిందో చెప్పడానికి ఇంతకంటే రుజువేం కావాలి? ఈ మార్పులో కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ పాత్ర కీలకం. అలా అని ఆమె సారథి కావడానికి ముందు కెప్టెన్లను తగ్గించడానికేమీ లేదు. అంతకుముందు 15 ఏళ్లలో ఎక్కువ కాలం సారథిగా ఉన్నది మిథాలీనే. 2005 ప్రపంచకప్ ఫైనల్లోనే కాదు.. 2017, 2022 టోర్నీల్లోనూ ఆమే కెప్టెన్. అయితే తన సారథ్యంలో చాలా ఏళ్లు మహిళల క్రికెట్ ప్రమాణాలే అంతంతమాత్రం. దేశంలో క్రికెట్ ఆడే అమ్మాయిలే తక్కువ. ఆడేవాళ్లలోనూ ఆత్మవిశ్వాసం ఉండేది కాదు. దూకుడుగా ఆడలేకపోయేవారు. ఉన్న తక్కువ వనరులతోనే ఓ మోస్తరుగా జట్టును నడిపిస్తూ సాగింది మిథాలి. అప్పుడు బ్యాటింగ్ భారాన్ని ప్రధానంగా ఆమే మోసింది. హర్మన్‌ప్రీత్, స్మృతి లాంటి ప్రతిభావంతులను గుర్తించి జట్టులోకి తెచ్చి, మార్పునకు పునాది వేసిన ఘనత మిథాలీదే. కానీ మొత్తంగా మహిళల క్రికెట్‌లో వేగం, పోటీ పెరిగిన దశలో జట్టును మరో స్థాయికి తీసుకెళ్లడానికి ఒక దూకుడైన కెప్టెన్ అవసరమైంది. ఆ బాధ్యతనే హర్మన్ తీసుకుంది. అప్పటికే బ్యాటర్‌గా మహిళల క్రికెట్లో తనదైన ముద్రను వేసిందామె. మహిళల క్రికెట్ చరిత్రలో అత్యంత ముఖ్యమైన విజయాల్లో ఒకటైన 2017 ప్రపంచకప్ సెమీస్ విజయంలో హర్మన్ (171 నాటౌట్)దే కీలక పాత్ర.

**మిథాలినే పక్కన పెట్టి..**

మిథాలి ఉండగానే టీ20 పగ్గాలందుకున్న హర్మన్.. జట్టు ఆడే తీరులో మార్పు తీసుకొచ్చింది. ఈ క్రమంలో దిగ్గజ క్రికెటర్ అయిన మిథాలిని సైతం ఒక మ్యాచ్‌కు పక్కన పెట్టడానికి వెనుకాడలేదు. దీనిపై విమర్శలు వచ్చినా వెనక్కి తగ్గలేదు. హర్మన్ వచ్చాక వన్డేల్లో సైతం భారత జట్టు వేగం అందుకుంది. షెఫాలి, రిచా లాంటి యువ క్రికెటర్ల రాకతో భారత జట్టులో దూకుడు మరింత పెరిగింది. ఈ క్రమంలోనే 2020 టీ20 ప్రపంచకప్ ఫైనల్‌కు అర్హత సాధించింది భారత్. కానీ ఆ సమయానికి ఆస్ట్రేలియాను ఓడించి కప్పు గెలిచే సామర్థ్యం జట్టుకు లేకపోయింది. మొత్తంగా జట్టు దృక్పథమే మారాల్సిన అవసరాన్ని హర్మన్ గుర్తించి.. ఆ దిశగా ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో మహిళల ప్రిమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) ఆరంభం, అమోల్ మజుందార్ కోచ్ కావడం కీలక మలుపు. మజుందార్‌తో కలిసి సరైన జట్టును ఎంచుకుని.. ఒక ప్రణాళిక ప్రకారం ముందుకు నడిపించింది హర్మన్. అందువల్లే ఈ ఏడాది ఇంగ్లాండ్ పర్యటనలో భారత జట్టు వన్డే, టీ20 సిరీస్‌లు సాధించగలిగింది. ప్రపంచకప్ ముంగిట ఆస్ట్రేలియాకు సిరీస్‌ను కోల్పోయినా.. ఒక మ్యాచ్‌లో ప్రత్యర్థిని చిత్తుగా ఓడించారు భారత అమ్మాయిలు. మరో మ్యాచ్‌లో 412 పరుగుల భారీ లక్ష్యం నిలిచినా డీలా పడకుండా విజయం కోసం ప్రయత్నించడం, 43 పరుగుల తేడాతో ఓడడం హర్మన్ సారథ్యంలో మారిన జట్టు దృక్పథానికి నిదర్శనం. ఇక ప్రపంచకప్‌లోనూ అదే ప్రదర్శనను కొనసాగించింది భారత్. లీగ్ దశలో 3 మ్యాచ్‌లు ఓడినా.. అవి స్వల్ప తేడాతోనే. ఆ ఓటముల నుంచి పాఠాలు నేర్చుకుని సెమీస్, ఫైనల్‌లో అద్భుత ఆటతీరుతో అమ్మాయిలు కప్పు సాధించారు. భారత్‌కు సెమీస్ బెర్తు సాధించి పెట్టిన కివీస్ మ్యాచ్‌లో 70 పరుగులు చేసిన హర్మన్.. సెమీస్‌లో ఆస్ట్రేలియాపై 89 పరుగుల అమూల్యమైన ఇన్నింగ్స్ ఆడింది. ఫైనల్లో బ్యాటుతో రాణించకపోయినా కెప్టెన్సీతో తనదైన ముద్ర వేసింది హర్మన్. లారా, లుజ్ భాగస్వామ్యం ప్రమాదకరంగా మారుతున్న దశలో షెఫాలికి బంతినివ్వడం కెప్టెన్‌గా హర్మన్ మాస్టర్ స్ట్రోక్. బౌలర్లను మార్చి మార్చి ప్రయోగిస్తూ.. చక్కటి ఫీల్డింగ్ ఏర్పాట్లతో హర్మన్ తన ముద్రను చూపించింది. భారత్‌కు విజయాన్నందించిన డిక్లెర్క్ క్యాచ్‌ను హర్మన్ భలేగా అందుకుంది.



# కోట్ల రూపాయలు.. వజ్రాల హారాలు

ముంబయి: చరిత్రాత్మక వన్డే ప్రపంచకప్ గెలిచిన భారత మహిళల జట్టుపై నజరానాల వర్షం కురుస్తోంది. హర్మన్‌ప్రీత్ బృందానికి బీసీసీఐ రూ.51 కోట్ల నగదు బహుమతిని ప్రకటించింది. కప్ గెలిచినందుకు భారత్‌కు ఐసీసీ నుంచి రూ.37.3 కోట్లు దక్కాయి. వ్యక్తిగతంగానూ క్రీడాకారులకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు నగదు బహుమతి ప్రకటించాయి. హిమాచల్ ప్రదేశ్.. పేసర్ రేణుక సింగ్‌కు రూ.కోటి ఇవ్వనుంది. ఆమెకు ప్రభుత్వ ఉద్యోగం కూడా ఇస్తామని ఆ రాష్ట్ర సీఎం సుఖ్వీందర్ సింగ్ తెలిపారు. పేసర్ క్రాంతి గౌడ్‌కు ఆమె సొంత రాష్ట్రం మధ్యప్రదేశ్ రూ.కోటి నజరానా ఇస్తున్నట్లు తెలిపింది.

వజ్రాల హారాలతో..: సూరత్‌కు చెందిన వ్యాపారవేత్త, రాజ్యసభ సభ్యుడు గోవింద్ డోలాకియా భారత మహిళా క్రికెటర్లకు ఒక్కొక్కరికి వజ్రాల హారాలు ఇస్తున్నట్లు ప్రకటించారు. అంతేకాక క్రికెటర్ల ఇళ్లకు సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

# ట్రెడిషనల్ లుక్‌లో అనసూయా అందాల ఆభరణం





యాంకర్‌గా కెరీర్ మొదలుపెట్టి, ఇప్పుడు సిల్వర్ స్క్రీన్‌పై కూడా తనదైన ముద్ర వేసుకుంటున్న అనసూయా భరద్వాజ్ ఎప్పటికప్పుడు ఫ్యాషన్ లుక్స్‌తో ఆకట్టుకుంటూనే ఉంది. లేటెస్ట్ గా ఆమె షేర్ చేసిన సిల్క్ చెక్స్ శారీ ఫోటోలు సోషల్ మీడియాలో బజ్ క్రియేట్ చేస్తున్నాయి. నేవీ బ్లూ బ్లౌజ్, రెడ్ అండ్ యెల్లో చెక్స్ కలయికతో కూడిన శారీతో క్లాసీ లుక్‌లో మెరిసిన అనసూయ, ట్రెడిషనల్ జ్యూవెలరీతో మొత్తం లుక్‌ని హైలెట్ చేశారు.ఆమె హేర్ స్టైల్, జువెలరీ, మేకప్ కలిసి ఆమె లుక్‌కి ప్రత్యేకమైన గ్లామర్ ను తీసుకొచ్చాయి. మూడ్ అన్ స్థాపబుల్ అంటూ ఆమె ఇచ్చిన క్యాప్షన్ కూడా ఫ్యాన్స్‌ని ఆకట్టుకుంది. ఆ ఫోటోలలో కనిపించిన నేచురల్ స్మైల్, పోజ్, అట్టిట్యూడ్ అన్నీ కలిపి ఒక స్టైలిష్ వైబ్‌ను రిఫ్లెక్ట్ చేస్తున్నాయి.కెరీర్ పరంగా చూస్తే, అనసూయ తన జర్నీని టెలివిజన్ యాంకర్‌గా ప్రారంభించింది. “జబర్దస్త్”, “డీ” వంటి షోలతో బుల్లితెర ప్రేక్షకుల మన్ననలు పొందింది. తరువాత ఆమె సినిమా రంగంలో అడుగుపెట్టి రంగస్థలం, పుష్ప: ది రైజ్ వంటి సినిమాల్లో ముఖ్యపాత్రలు పోషించి వెర్సటైల్ యాక్ట్రెస్‌గా నిరూపించుకుంది. ఇక ఇప్పుడు ఓటీటీ, సినిమాలు, ఈవెంట్స్ ఎక్కడైనా ఆమెకు ప్రత్యేక గుర్తింపు ఉంది.పాజిటివ్ రోల్స్‌తో పాటు గ్రే షేడ్స్‌లోనూ తన నటనతో దృష్టిని ఆకర్షించింది. తన ప్రతి పాత్రను డిఫరెంట్‌గా మలచుకునే అనసూయ, స్క్రీన్‌పై కూడా, స్క్రీన్ వెలుపల కూడా స్ట్రాంగ్ ప్రెజెన్స్‌ను కొనసాగిస్తోంది. మొత్తం మీద ఈ ట్రెడిషనల్ సారీ లుక్‌లో అనసూయ చూపించిన కాన్ఫిడెన్స్, గ్రేస్ సోషల్ మీడియాలో మరలా చర్చనీయాంశమైంది. ఏ లుక్ అయినా తనదైన స్టైల్లో హైలెట్ చేస్తారు అని ఎక్కువమంది పాజిటివ్ గా స్పందిస్తున్నారు.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com